APTEL/26/A4813

శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త

సంపుటి : 01 సంచిక :62 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ బుధవారం - 09 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు.. రైల్వే మంత్రి కీలక ప్రకటన

- వచ్చే ఏడాది మే, జూన్‌లో బుల్లెట్ రైలు ట్రయల్స్
- 2 నుంచి 4 నెలల తర్వాత అధికారికంగా ప్రారంభం
- తొలి బాడీ ఫ్రేమ్ ఇప్పటికే సిద్ధమైందన్న అశ్విని వైష్ణవ్

2లో

ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే: డొనాల్డ్ ట్రంప్

2లో

- ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు పడిపోతాయన్న ట్రంప్
- గ్యాలన్ పెట్రోల్ ధర 2 డాలర్ల కంటే తక్కువకు వస్తుందని జోస్యం
- ట్రూత్ సోషల్ వేదికగా తన అభిప్రాయాన్ని వెల్లడించిన అధ్యక్షుడు
- ఇరాన్ ఇంధన వనరులపై దాడి చేస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ హెచ్చరిక

2లో

నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా: సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

- మహిళల గౌరవంపై విజయ్ తీసుకున్న నిర్ణయాలు సంతోషాన్ని ఇచ్చాయన్న చంద్రశేఖర్
- ప్రత్యర్థి పార్టీల చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని వ్యాఖ్య
- ప్రతిపక్షాల విమర్శలను విజయ్ తిప్పికొట్టిన తీరు సంతోషాన్ని ఇచ్చిందని వెల్లడి

అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం: చంద్రబాబు

2లో

- ఓటు వేయని వారినీ మార్చుకుందాం
- 2026-27లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉంది
- 15-20 రంగాల్లో అభివృద్ధి ద్వారా జీఎస్డీపీని మరింత పెంచాలి
- రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలి

నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు

- ★ స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు
- ★ వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ
- ★ పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- ★ మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్

ఢిల్లీ: గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. మిగతా 2 లో

2లో

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ... డిప్యూటీ సీఎం

బీఆర్ఎస్ భావజాలం, ఆలోచన స్పష్టంగా అర్థమవుతోంది

తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించింది

సభాపతిని అంటే సభ మట్లత్తాన్ని అన్నట్లే

దళిత వర్గాల్లో పుట్టి ఎదిగి వచ్చిన వ్యక్తి స్పీకర్ గడ్డం ప్రసాద్

శాసనసభకు, స్పీకర్ స్థానానికి, రాష్ట్ర ప్రజలకు అవమానం

తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి ఆయనతో రాజీనామా చేయించాలి

- ➤ ఎమ్మెల్సీ తాతా మధుతో కేసీఆర్ రాజీనామా చేయించి, క్షమాపణ చెప్పాలి
- ➤ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్

హైదరాబాద్: రెండో రోజు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రేపటికి వాయిదా పడ్డాయి. (మంగళవారం, సెప్టెంబర్ 8వ తేదీ) సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యుల నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలోనే ప్రతిపక్ష బీఆర్ఎస్- ప్రభుత్వ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రధానంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ అంశంపై సభ హోరెత్తిపోయింది. దీనిలో భాగంగా స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలపై చర్యలకు సభలో తీర్మానం పెట్టారు. మిగతా 2 లో

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాని సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు? టీడీపీ నేతలను ప్రశ్నించిన లోకేశ్

సోషల్ మీడియాను ఎంతమంది యాక్టివ్ గా వాడుతున్నారు?: టీడీపీ నేతలను ప్రశ్నించిన లోకేశ్

సోషల్ మీడియా వినియోగంపై టీడీపీ నేతలకు నారా లోకేశ్ దిశానిర్దేశం

ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

ప్రధాని మోదీని, తనను ఉదాహరణగా చూపుతూ నేతలకు దిశానిర్దేశం

అమరావతి అభివృద్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశం

అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' మిగతా 2 లో

వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీఎం ఆదేశం

- ★ ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ★ ఎమ్మార్పీ కంటే ఎక్కువకు మద్యం అమ్మితే కఠిన చర్యలని హెచ్చరిక
- ★ ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచన
- ★ 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన పనులకు ఆమోదం
- ★ టెక్నాలజీ సాయంతో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, మిగతా 2 లో

2లో

మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్

- దళిత వర్గానికి చెందిన స్పీకర్ కు గౌరవం ఇవ్వడం లేదన్న సీతక్క
- సబితను తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుందన్న మంత్రి
- మహిళా పోలీసు అధికారులపై బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని వెల్లడి

'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..

2లో

- కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని విమర్శ
- ప్రభుత్వంపై డైవర్షన్ రాజకీయాల ఆరోపణ
- అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్
- దళిత, గిరిజన హామీలు అమలు చేయాలని డిమాండ్

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని
సోషల్ మీడియాలో తిప్పికొట్టాలి

అమరావతి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రెండో రోజు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నేతలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేశారు. 'పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్' అనే అంశంపై మాట్లాడుతూ, ఆయన నేరుగా సభికులను "మీలో ఎంతమంది సోషల్ మీడియాను చురుకుగా వినియోగిస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నతోనే సాంకేతికతను రాజకీయ ప్రచారానికి వాడుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. "సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దు. దీనిపై చాలా సీరియస్‌గా ఉండాలి" అని లోకేశ్ నేతలకు స్పష్టం చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయాలని ఆయన సూచించారు. చిన్న స్థాయి నాయకులైన ఏఎంసీ, కార్పొరేషన్ ఛైర్మన్లు కూడా తాము చేస్తున్న పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వివరిస్తున్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని ఆయన ఉదాహరణగా చూపారు. ప్రధాని మోదీ సైతం తన సందేశాలను సెల్ఫీ వీడియోల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్టు శంకుస్థాపన, డీఎస్సీపై జరుగుతున్న దుష్ప్రచారం వంటి అంశాలపై సెల్ఫీ వీడియోలు తీసి వాస్తవాలను ప్రజల ముందు ఉంచానని తెలిపారు. విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు నిజాలు తెలియజేయాల్సిన బాధ్యత నేతలపై ఉందని అన్నారు. ప్రతిపక్షాల తీరుపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షం పని కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమేనని, వారి దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు తమ నాయకుడు 'జగన్ మావిగన్' అంటే గుడ్డిగా సమర్థిస్తున్నారని, కానీ టీడీపీ అలా కాకుండా వాస్తవాలతో ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

వాట్సప్ గవర్నెన్స్, డిజిటల్ సేవలు.. పాలనలో బెస్ట్ ప్రాక్టీసెస్ పాటించాలి

అమరావతి: ప్రభుత్వ, పరిపాలన సేవలను ప్రజలకు మరింత సమర్థంగా అందించడంపై దృష్టి సారించాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ ఎమ్మెల్యేలు, నేతలకు పిలుపునిచ్చారు. రెండోరోజు లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో ప్రసంగించిన ఆయన, కొన్ని నియోజకవర్గాలు పౌర సేవల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని, అన్ని నియోజకవర్గాలు ఆ ఉత్తమ పద్ధతులను (బెస్ట్ ప్రాక్టీసెస్) అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేస్తున్నామని, దీనివల్ల ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకుంటున్నామని చంద్రబాబు గుర్తుచేశారు. ఎక్కడైనా ఇసుక అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతే కఠినంగా అడ్డుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విధానాన్ని అస్తవ్యస్తం చేసి, నకిలీ బ్రాండ్లతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. ఇప్పుడు మద్యం విక్రయాల్లో పారదర్శకత తీసుకొచ్చామని, ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానిక ఎమ్మెల్యేలదేనని స్పష్టం చేశారు.



ఫేక్ ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టండి..

ప్రభుత్వంపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అనేక సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తున్నామని, క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రమైన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లోని దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా స్వీకరించి పరిష్కరించాలని, తద్వారా ఎమ్మెల్యేలకు ప్రజల్లో మంచి పేరు వస్తుందని అన్నారు. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే సానుకూల దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, 2027 మార్చి నాటికి భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నామని, గత మూడేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని గుర్తుచేశారు. గత సమావేశంలో ఎమ్మెల్యేలు లేవనెత్తిన అంశాలను సమీక్షించి, 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 అభివృద్ధి పనులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

వచ్చే ఏడాదే బుల్లెట్ రైలు పరుగులు..
రైల్వే మంత్రి కీలక ప్రకటన

ఢిల్లీ: భారత్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న తొలి బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. వచ్చే ఏడాది మే లేదా జూన్‌లో ఈ రైలు ట్రయల్ రన్స్ ప్రారంభమవుతాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరీక్షలు పూర్తైన రెండు నుంచి నాలుగు నెలల్లో వాణిజ్య సేవలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. వడోదరలో నిర్వహించిన 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో మంత్రి ఈ వివరాలు వెల్లడించారు. దేశీయంగా తయారవుతున్న హైస్పీడ్ రైలు తొలి బాడీ ఫ్రేమ్ ఇటీవలే పూర్తయిందని చెప్పారు. ప్రస్తుతం దానిపై స్ట్రెస్ టెస్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "వచ్చే ఏడాది మే లేదా జూన్ నాటికి మన సొంత బుల్లెట్ రైలు ట్రయల్స్ కోసం పట్టాలపైకి వస్తుంది. రెండు నుంచి నాలుగు నెలల పరీక్షల తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలును ప్రారంభిస్తారు" అని వైష్ణవ్ చెప్పారు. ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు కారిడార్ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. సూరత్-వాపి మార్గం ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే వడోదర నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం గంటన్నర మాత్రమే ఉంటుందని చెప్పారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశీయ బుల్లెట్ రైలు ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైల్వే రంగంలో ఆపరేటింగ్, రిజర్వేషన్ వ్యవస్థలతో పాటు నిర్మాణ విధానాలను ఆధునికీకరిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 280 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసినట్లు వైష్ణవ్ తెలిపారు. కొత్తగా 36 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు వేశామని చెప్పారు. వందే భారత్ సాంకేతికతతో కార్గో రైళ్లను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. చినాబ్ వంతెన, మిజోరాంను జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే ప్రాజెక్టు వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యాయని తెలిపారు. కొవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి వేగం పెరిగిందన్నారు.

'కేసీఆర్‌ను చంపే కుట్ర జరుగుతోంది'..
కేటీఆర్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ శ్రేణులు కుట్రపూరితంగా హత్యాయత్నం చేశాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు అరాచకానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఫాంహౌస్‌కు వెళుతున్న తమను అరెస్ట్ చేసి బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నివాస ప్రాంగణం వరకు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఎలా అనుమతించారని కేటీఆర్ ప్రశ్నించారు. తమ సొంత ఇంటికి తాము వెళుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారో డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణుల దాడులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ నేతలను మాత్రమే పోలీసులు లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ప్రజల దృష్టిని ప్రభుత్వ వైఫల్యాల నుంచి మళ్లించేందుకే డైవర్షన్ రాజకీయాలకు తెరలేపారని అన్నారు. "డైవర్షన్, డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్ తప్ప రేవంత్‌రెడ్డికి మరో విద్య తెలియదు" అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యలపై ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను విమర్శించేందుకు సభను ఉపయోగించుకోవడం సరికాదన్నారు. ఇందుకోసం ఒక రోజు కేటాయించి.. మిగిలిన రోజుల్లో ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దళితులపై ప్రభుత్వానికి నిజమైన ప్రేమ ఉంటే దళిత, గిరిజన డిక్లరేషన్ హామీలను వెంటనే అమలు చేయాలని కేటీఆర్ కోరారు. దళితబంధు కింద ఒక్కొక్కరికి రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి.. కనీసం రూ.12 పైసలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని.. సరైన సమయం వచ్చినప్పుడు ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెబుతారని కేటీఆర్ అన్నారు.

నా వడోదరా అద్భుతం.. ప్రధాని మోదీ భావోద్వేగం

ఢిల్లీ: గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు. "ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు. ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం..



ఢిల్లీ: ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు. ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

శాసనసభకు, స్పీకర్ స్థానానికి,రాష్ట్ర ప్రజలకు అవమానం

మొదటి పేజి తరువాయి

ఇందుకు సభలో ఆమోదం లభించింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై భారాస ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలపై శాసనసభ మండిపడింది. ఆయన మాటలు సభాపతి స్థానానికే కాక.. మొత్తం అసెంబ్లీకి, నాలుగు కోట్ల మంది ప్రజలకు అవమానకరమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది తెలంగాణకు చీకటి రోజని వెల్లడించారు. స్పీకర్ మాతృమూర్తిని అవమానించడం బాధాకరమని మంత్రి సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భావోద్వేగానికి గురైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి పెట్టారు. అధికారపక్షానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు భాజపా, ఎంఐఎం, సీపీఐ సభ్యులు సైతం భారాస ఎమ్మెల్సీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ మధు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు దుర్భాషలాడారని తెలుసుకొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తీవ్రంగా స్పందించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్‌కు, శాసనమండలి ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మధ్యాహ్నం సమయంలో ఈ అంశంపై శాసనసభలో ప్రత్యేకంగా చర్చించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్కలు మాట్లాడుతూ.. తాతా మధు ఎమ్మెల్సీ సభ్యత్వం రద్దు చేయడంతోపాటు ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. భారాస దళిత వ్యతిరేక పార్టీ అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. భాజపా, మజ్లిస్ నేతలు సైతం తాతా మధుతో

రాజీనామా చేయించాలని కోరారు.

స్వతంత్ర భారతంలో ఒక సభాపతికి ఇలాంటి అవమానం ఎప్పుడూ జరగలేదని, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. 'ఇలాంటి వ్యాఖ్యలను క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండవు. సభా సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది. సభలో ముఖ్యమంత్రైనా, శాసనసభ్యుడైనా స్పీకర్‌కు ఒకటే. అలాంటి వ్యక్తి మనసు గాయపడేలా భారాస వ్యవహరించింది. ఈ ఘటన గడ్డం ప్రసాద్‌కుమార్ ఒక్కరికే సంబంధించినది కాదు. మొత్తం సభ్య సమాజానికే జరిగిన అవమానంగా భావించాలి. స్పీకర్ పదవి ఒక అత్యున్నత స్థానం. సభాపతిని గౌరవించడం మన సంప్రదాయం. అలాంటి స్థానంలో ఉన్న వ్యక్తిపైనా, ఆయన కుటుంబసభ్యులపైనా సభ్య సమాజం తలదించుకునేలా కొంతమంది మాట్లాడారు. నేను జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా అన్ని సభలనూ చూశాను. కానీ, ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను నిన్న పిలిపించుకుని స్పీకర్‌పై పథకం ప్రకారమే ఉసిగొల్పారు. తెలంగాణ వస్తే దళితుడిని సీఎం చేస్తానని, మూడెకరాల చొప్పున ఇస్తానని, దళితబంధు ఇస్తామని నమ్మించి.. దళిత ఉపముఖ్యమంత్రిని బర్తరఫ్ చేశారు. నేరెళ్లలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న దళితులను లారీలతో తొక్కించి చంపారు. ఒక దళితుడిని కాంగ్రెస్ సీఎల్పీ నాయకుడిని చేస్తే పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించి, ప్రతిపక్ష హోదా నుంచి తొలగించారు. భారాసది దళిత వ్యతిరేక ఆలోచన, వైఖర్లను అందరం ముక్తకంఠంతో ఖండించాలి. ప్రభుత్వం సంయమనం పాటిస్తుంటే చేతకానితనంగా భావిస్తున్నారు. అదిరించి, బెదిరించి వ్యవస్థలను లొంగదీసుకుంటామంటే చూస్తూ ఊరుకోం. తాతా మధు వ్యాఖ్యలపై కేసీఆర్ క్షమాపణ చెప్పి, ఆయనతో రాజీనామా చేయించాలని సభా నాయకుడిగా నేను డిమాండ్ చేస్తున్నా" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ చర్చ సమయంలో భాజపా నేతలు 22ఏపై చర్చించాలని పోడియం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. అనంతరం వారు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అత్యంత అవమానకరంగా స్పీకర్‌నుద్దేశించి మాట్లాడితే.. చర్చకు ఇంతకంటే ప్రాధాన్యమున్న అంశం ఏముంటుందని ప్రశ్నించారు. భారాస వేసిన అపవాదు, దుర్మార్గాలను భాజపా ఎందుకు కాపాడుతోందని నిలదీశారు. భారాస ఎమ్మెల్సీ తాతా మధును భాజపా సమర్థిస్తోందా అని ప్రశ్నించారు. అందరం ముక్తకంఠంతో ఖండించాల్సిన సమయమని, రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి ఇలాంటి దుర్మార్గపు పోకడలను నియంత్రించాలని సూచించారు.

నా కొడుకుని చూసి చాలా గర్విస్తున్నా
సీఎం విజయ్ తండ్రి చంద్రశేఖర్

తమిళనాడు: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ చుట్టూ తిరుగుతున్న రాజకీయ, వ్యక్తిగత వివాదాల వేళ విజయ్ తండ్రి, సీనియర్ దర్శకుడు ఎస్.ఏ. చంద్రశేఖర్ చేసిన తాజా వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇటీవల జరిగిన పలు రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ వ్యాఖ్యల అనంతరం మాట్లాడిన ఆయన... తన కొడుకుని చూసి తాను ఎంతో గర్వపడుతున్నాను అంటూ కుమారుడికి పూర్తి మద్దతుగా సంచలన ప్రకటన చేశారు. గతంలో విజయ్‌తో ఉన్న విభేదాలు, వ్యక్తిగత వివాదాల వల్ల దూరంగా ఉంటున్నారనే ప్రచారానికి చెక్ పెడుతూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆయన విజయ్ వైఖరిని గట్టిగా సమర్థించారు. మహిళల గౌరవం, రాజకీయ మర్యాదలపై సభలో విజయ్ తీసుకున్న స్పష్టమైన నిర్ణయాలు, ప్రతిపక్ష విమర్శలను తిప్పికొట్టిన తీరు పట్ల ఒక తండ్రిగా తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న చవకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని, కొడుకు విజయాన్ని, పట్టుదలను చూసి గర్విస్తున్నానని ఎస్.ఏ. చంద్రశేఖర్ స్పష్టం చేశారు. తండ్రి నుంచి వచ్చిన ఈ బహిరంగ మద్దతుతో టీవీకే వర్గాలు, విజయ్ అభిమానుల్లో సరికొత్త ఉత్సాహం నిండింది.

మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?

హైదరాబాద్: శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. "సొంత చెల్లెలు కవితను పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు లేని బాధ, హరీశ్ రావును ఏదైనా అంటే ఎందుకు వస్తోంది?" అని సీతక్క బీఆర్ఎస్ నేతలను సూటిగా ప్రశ్నించారు.

ఇరాన్‌తో యుద్ధంలో గెలిస్తే గ్యాలన్ పెట్రోల్ 2 డాలర్లకే

ఢిల్లీ: ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో అమెరికా గెలిస్తే చమురు ధరలు భారీగా పడిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్యాసోలిన్ ధర గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుందని ఆయన జోస్యం చెప్పారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఇరాన్‌తో యుద్ధంలో మనం గెలిచినప్పుడు, మిగతావన్నీ పడిపోతున్నట్లే చమురు ధరలు కూడా వేగంగా పడిపోతాయి. మొదట గ్యాలన్ ధర మూడు డాలర్లకు, ఆ తర్వాత రెండు డాలర్ల కంటే తక్కువకు చేరుకుంటుంది. ఇదంతా చాలా వేగంగా జరిగిపోతుంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని తయారు చేయలేదు. మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (ఎంఏజీఏ)!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికాలో గ్యాసోలిన్ సగటు ధర గ్యాలన్‌కు సుమారు 4.15 డాలర్లుగా ఉంది. లేబర్ డే సమయంలో ఇది రికార్డు స్థాయి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 97 డాలర్ల వద్ద, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) 92 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ కూడా ఘాటుగా స్పందించింది. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ మాట్లాడుతూ.. తమ దేశ ఇంధన వనరులపై దాడి చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇరాన్ ఆయిల్, గ్యాస్ ఉత్పత్తి వ్యవస్థలు బహిరంగంగానే ఉన్నాయని, అయితే అమెరికా ఆస్తులు కూడా అదే విధమైన బలహీనతను పంచుకుంటాయని ఆయన గుర్తుచేశారు. గతంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్ల విషయంలో అమెరికా చేసిన వ్యాఖ్యలను, దానికి తాము ఇచ్చిన సమాధానాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇదిలా ఉంటే.. ఇరాన్‌కు చెందిన నౌకలపై దాడులకు సంబంధించి అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. అయితే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందో, ప్రపంచ ఇంధన మార్కెట్లపై దాని ప్రభావం కచ్చితంగా ఎలా ఉంటుందో అనే దానిపై ట్రంప్ వ్యాఖ్యలు మినహా స్వతంత్రంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు.

నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి

అమరావతి: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు. తన పార్టీ కేఏ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు. తన కొత్త పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తాను ఉండబోనని, సమర్థులైన వ్యక్తినే ఆ స్థానంలో నిలబెడతామని విజయసాయిరెడ్డి తెలిపారు. ఆసక్తితో 'రెడ్డి' సామాజిక వర్గం ఆవిర్భావం, రెడ్డి రాజుల పాలనపై 350 పేజీల పుస్తకం రాసినట్లు ఆయన వెల్లడించారు.

అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం: చంద్రబాబు

అమరావతి: అభివృద్ధితో ఓటు బ్యాంకును పెంచుకుందాం.. ఓటు వేయని వారినీ మార్చుకుందాం అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. తెదేపా లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో 2వ రోజు సుస్థిర అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని సూచించారు. 2026-27లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉందని, 15-20 రంగాల్లో అభివృద్ధి ద్వారా జీఎస్డీపీని మరింత పెంచాలన్నారు. మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1,250 నుంచి 1,400 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో భారీగా ఉద్యోగాలు, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని, నీటి లభ్యత సమస్య కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు.

పార్టీ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాల్సిందే

అమరావతి: పార్టీ పదవుల్లో ఉన్నవారిని మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని, పార్టీనే సుప్రీం అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెదేపా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యక్రమాల నిర్వహణపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. పార్టీ ఏదైనా పని చెబితే దానికే మొదటి ప్రాధాన్యమివ్వాలని లోకేశ్ తెలిపారు. "క్వాంటమ్ టవర్స్‌కు సంబంధించిన కార్యక్రమానికి నన్ను ఆహ్వానిస్తే... అదే సమయంలో పార్టీ అప్పగించిన పని ఉండటంతో అదే నాకు ముఖ్యమని చెప్పి, ఆ కార్యక్రమానికి వెళ్లలేదు" అని ఆయన సొంత అనుభవాన్ని వెల్లడించారు. "పార్టీ ఇచ్చిన పనుల్ని తప్పనిసరిగా చేయాల్సిందే. పార్టీ పదవుల్లో ఉన్నవారు.. పార్టీ కార్యక్రమాలకు రావడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు" అని స్పష్టం చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు బీఫారం ఇవ్వకపోతే... ఇక్కడున్నవారెవరూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కాలేరన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఆయన పేర్కొన్నారు. "పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదన్న విషయాన్ని ప్రతి క్షణం గుర్తుంచుకోవాలి. నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఎలా జరుగుతున్నాయో నిరంతరం సమీక్షించుకోవాలి" అని కోరారు.

ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ... డిప్యూటీ సీఎం



హైదరాబాద్: స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ వ్యాఖ్యలతో బీఆర్ఎస్ భావజాలం, ఆలోచన స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు.

అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ఇది స్పీకర్‌కు కాదు సభకు జరిగిన అవమానం అని తెలిపారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సభ తీర్మానించిందన్నారు. యావత్ చట్టసభనే బీఆర్ఎస్ సభ్యులు అవమానించారు. సభాపతిని అంటే సభ మట్నత్తాన్ని అన్నట్లే దళిత వర్గాల్లో పుట్టి ఎదిగి వచ్చిన వ్యక్తి స్పీకర్ గడ్డం ప్రసాద్ అని తెలిపారు. ఫ్యూడల్ విధానం మీద పోరాడిన చరిత్ర ఈ సభకు ఉందన్నారు. ఫ్యూడల్ భావజాలం నుంచి పుట్టిందే బీఆర్ఎస్ అని ప్రస్తుతం ఫాంహౌజ్ కుట్ర నడుస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాతా మధు, నవీన్ రెడ్డిలపై చర్యలకు మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భట్టివిక్రమార్క బలపరిచారు. తీర్మానాన్ని మండలి ఛైర్మన్‌కు పంపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

వేసవి వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

గండిగుంటలో శ్రీరత్నగర్భ గణపతి

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

పత్యక పూజలు చేసిన హరివిల్లు గ్రూప్ ఆఫ్ సంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి,

కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ఉయ్యూరు మండలం గండిగుంటలో బందరు రోడ్డుకు సమీపంలో ఉన్న హరివిల్లు వారి ఫార్చ్యూన్ గ్రీన్ ప్రీమియం గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ లో శ్రీరత్నగర్భ గణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుండి 72 గణపతి పూజలు, యాగం,హోమం, మంత్ర జపం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో హరివిల్లు గ్రూప్ ఆఫ్ సంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ వేములపల్లి లక్ష్మణ చౌదరి, వినియోగదారులు, గ్రామస్థులు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటేలో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ

బంటుమిల్లి శ్రీ వార్త న్యూస్: జాతీయ స్థాయిలో కరాటే పోటీలలో కొమ్మారెడ్డి విద్యార్థులు వివిధ పథకాలు సాధించారు .ఆంధ్రప్రదేశ్ కర్నూలులో పుష్పరాజ్ కన్వెన్షన్ హాల్ లో ఆదివారం గోజు రియు కరాటే డో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్,వారు నిర్వహించిన 13 వ జి.కె.యం.ఎ జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్ - 2026 నందు వివిధ రాష్ట్రాల నుండి సుమారు 1400 మంది పైన విద్యార్థులు పాల్గొన్నారు. అందులో పాల్గొన్న కొమ్మారెడ్డి విద్యార్థులు వివిధ జాతీయస్థాయి పతకాలు సాధించారు.పతకాలు సాధించిన మా విద్యార్థులు :పి.యు.వి. కార్తీక్ (3 వ తరగతి) - 8 సంవత్సరాల కటా విభాగంలో -- జాతీయస్థాయి ప్రథమస్థానం కె.యల్.జి. సాయి హర్షిణి (6 వ తరగతి) - 11 సంవత్సరాల కటా విభాగంలో -- జాతీయస్థాయి ప్రథమస్థానం సాధించారు. ఇంతటి అద్భుత ప్రతిభ కనబరచిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రెటరీ మరియు కరెస్పాండెంట్ కె. యస్.వి.జి.శోభ కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య డైరెక్టర్ ఒ వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి కరాటే కోచ్ యస్. వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు, పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ లో వాహనదారులకు అదనపు సేవలు

నూతన సర్వీసింగ్ సదుపాయాలు ప్రారంభం

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో మచిలీపట్నంలోని కృష్ణాజిల్లా పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ లో వాహనదారులకు అదనపు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు.నూతన వాహన సర్వీసింగ్ సదుపాయాలను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, హెచ్ పీసీఎల్ అథారిటీ ఆర్ఎంఓ అభిషేక్ ప్రతాప్ సింగ్ తో కలిసి ప్రారంభించారు.ఇకపై ఈ పెట్రోల్ బంక్ లో పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్ కే పరిమితం కాకుండా వీల్ అలైన్ మెంట్, చిన్నచిన్న మరమ్మతులు, సర్వీసింగ్ వంటి సేవలను కూడా అందించనున్నారు. వాహనదారులు ప్రాథమిక సర్వీసుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒకేచోట సౌకర్యవంతంగా సేవలు పొందేలా ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నాణ్యమైన, సరసమైన ధరలలో వేగవంతమైన సర్వీస్ అందించడమే లక్ష్యమని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హెచ్ పీసీఎల్ సేల్స్ ఆఫీసర్ గంగా ప్రసాద్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండపాల్లో విద్యుత్ భద్రతే ప్రధానం..

అనధికార కనెక్షన్లు వద్దు.....ఎపిసిపిడిసిఎల్ సీఎండీ పుల్లారెడ్డి



విజయవాడ శ్రీ వార్త న్యూస్వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భక్తితో పూజిద్దాం.. భద్రతతో పండుగ జరుపుకుందామని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి పిలుపునిచ్చారు.మండపాలను విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలకు తగినంత దూరంలో ఏర్పాటు చేయాలని, మండపాల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అలంకరణలకు నాణ్యమైన వైర్లు, స్విచ్ లు, ప్లగ్ లు మాత్రమే వినియోగించాలని, వైరింగ్ పనులను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్లతోనే చేయించాలని తెలిపారు. అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకోవద్దని హెచ్చరించారు.వర్షాల సమయంలో విద్యుత్ పరికరాలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడిసిన పరికరాలను తాకరాదని, విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.గణేష్ మండపాలకు ఈ నెల 26వ తేదీ వరకు తాత్కాలిక విద్యుత్ సరఫరా ఇస్తామని సీఎండీ తెలిపారు. 500 వాట్లకు రూ.1,000, 1,000 వాట్లకు రూ.2,250 చొప్పున తాత్కాలిక రుసుము ఉంటుందని, దరఖాస్తు రుసుము రూ.100 అని వెల్లడించారు. స్వర్ణ గ్రామ/వార్డు సచివాలయాలు, ఎపిసిపిడిసిఎల్ వెబ్ సైట్ మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పింఛన్లకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలి.

అధికారులకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశాలు

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ జిల్లాలో వచ్చే వేసవి వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగిస్తూ, నీటి వృథాకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదన్నారు.మంగళవారం సాయంత్రం నగరంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి గ్రామీణ నీటిపారుదల విభాగం, జిల్లా పంచాయతీ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు విభాగం అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు తదితరులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాగునీటి భద్రత, పారిశుద్ధ్యం, పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వచ్చే వేసవి వరకు తాగునీటి వనరులను పొదుపుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి వనరులకు అవసరమైన మేరకు రీఫిల్లింగ్స్ చేసుకునే విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.గ్రామీణ తాగునీటి పథకాల నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లోని తాగునీటి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, పంపింగ్, క్లోరినేషన్, ఫిర్యాదులు, నీటి వినియోగానికి సంబంధించిన డిజిటల్ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.గ్రామాల్లో ఎక్కడైనా ఎస్ఎస్ ట్యాంకులు, ఛానళ్లలో సిల్టేషన్ ఉంటే వెంటనే తొలగించాలని, ఫిల్టర్ బెడ్లు క్లాగ్ అయితే వాటిని శుభ్రం చేయాలని సూచించారు. అవసరమైన చోట పంచాయతీ లేదా మండల పరిషత్ నిధులను వినియోగించుకుని మరమ్మతులు చేపట్టాలన్నారు.పైప్‌లైన్ లీకేజీలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అరికట్టాలని, పనిచేయని వాల్వులు, పంపులు, ప్యానెల్ బోర్డులను గుర్తించి మరమ్మతులు చేయించాలని చెప్పారు. నీటి వృథాకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదన్నారు. తాగునీటిని చేపల చెరువులు లేదా ఇతర అనవసర వినియోగానికి మళ్లించకుండా అధికారులు కఠినంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ వనరులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.ఆర్ఓ ప్లాంట్లు నిరంతరం పనిచేసేలా చూడాలని, ప్రైవేట్ నిర్వహణలో ఉన్న ఆర్ఓ ప్లాంట్లను కూడా తనిఖీ చేసి నీటి నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. నీటి ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా క్లోరినేషన్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టిప్రజల్లో సానుకూల స్పందన వచ్చేలా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరుగుతుందా, వారానికి కనీసం రెండుసార్లు చెత్త సేకరణ జరుగుతోందా అనే అంశాలను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బందికి అవసరమైన సామగ్రి, ట్రైసైకిళ్లు, ఆటోలు, పుష్‌కార్టులు తదితర పరికరాలు పనిచేసే స్థితిలో ఉన్నాయో లేదో పరిశీలించాలని చెప్పారు. అవసరమైన చిన్నపాటి సామగ్రిని వెంటనే సమకూర్చుకోవాలన్నారు. ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, డీఎల్‌పీవోలు, సంబంధిత అధికారులు ఈ అంశాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చర్యలుపింఛన్ల దరఖాస్తుల విషయంలో అర్హత కలిగిన ఒక్క లబ్ధిదారుడు కూడా మిగిలిపోకుండా చూడాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అదే సమయంలో అనర్హులకు పింఛన్లు మంజూరు కాకుండా సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పింఛన్ దరఖాస్తుల్లో తలెత్తే సాంకేతిక సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల ఖాళీల కారణంగా దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే ఇన్‌చార్జీలను నియమించి అవసరమైన లాగిన్ సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు.పింఛన్లకు సంబంధించిన సందేహాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సిబ్బంది సంబంధిత అధికారుల ద్వారా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలు లేదా లాగిన్ సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా సమాచారం అందిస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.వీడియో కాన్ఫరెన్స్లో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖర్, డిపిఓ ఎం ధనలక్ష్మి, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు, డీఎల్‌పీవోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలి - సిపిఎం డిమాండ్

ఘంటసాల శ్రీవార్త న్యూస్ :మండల లంకపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి మహమ్మద్ రఫీ,షేక్ సలీమ్ గృహములు పూర్తిగా కాలి పోవడం జరిగినది. ఉభయ కుటుంబాలకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయం చేసి ఆదుకోవాలని, ఇందిరా ఆవాస్ యోజన గృహ నిర్మాణం పథకం పునరుద్ధరించి, ప్రభుత్వం గృహ నిర్మాణాలు చేపట్టాలని, ఆర్థికంగా సహాయం ప్రకటించి కుటుంబాలను నిలబెట్టాలని, సిపిఎం పార్టీ కృష్ణా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారాయణరావు, ఘంటసాల మండలం కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ కరీముల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పింఛన్ల నిబంధనలు సరళ తరం చేయాలి -- ప్రభుత్వం వైఖరి మారాలి "వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ .

ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :రాష్ట్రం ప్రభుత్వం అర్హులైన వారికి పింఛన్లు అందించడం పై నిబంధనలను సరళ తరం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం కృష్ణాజిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది.కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేయటం వల్ల అనేకమంది అర్హులు పింఛన్లు కు దూరమవు తున్నారని ,రేషన్ కార్డు ,ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ సదరం సర్టిఫికెట్, ఓటరు గుర్తింపు కార్డు, వంటి పత్రాలను ప్రామాణికంగా పరిగణించాలని సంఘం జిల్లా కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. ఆధార్ అప్ డేట్ అద్దె దారులకు విద్యుత్ బిల్లులు వంటి నిబంధనలతో పింఛన్ మంజూరు ప్రక్రియ కఠిన తరం చేయడం ,వయోపరిమితిని గతంలో ఉన్న 35 ఏళ్లకు పునరుద్ధరించాలని, గతంలో రెవెన్యూ శాఖ జారీ చేసిన ఒంటరి మహిళా ధ్రువీకరణ పత్రాలు కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కుల ధృవీకరణ పత్రం ఒకసారి జారీ అయితే వ్యక్తి కులం మారదు, అలాంటప్పుడు గతంలో జారీ చేసిన చెల్లుబాటు అయ్యే కుల ధ్రువీకరణ పత్రాలను పింఛన్ దరఖాస్తుకు స్వీకరించకుండా.. ఆస్తి పన్ను, ఇంటి నెంబరు వంటి వివరాలు దరఖాస్తు లో తప్పనిసరిగా చేయటం మరో సమస్య మారుతుంది .ఇప్పటికే రాష్ట్రంలో సొంత ఇల్లు లేని వారు చాలామంది పేదలు ఉన్నారు. అద్దె ఇంట్లో ఉన్న వారికి ఇంటి పన్ను, విద్యుత్ రసీదులు ఉండవు, నూతన నిబంధనలతో 8 రకాల పత్రాలు ఇవ్వాలంటూ ఆంక్షలు పెట్టడం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త పింఛన్ల ప్రకటన చేయడమే దీనికి నిదర్శనం అన్నారు. విడాకుల పత్రం లేదన్న కారణంతో ఇచ్చే కొద్దిపాటి ఆర్థిక సహాయానికి దూరం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు., పెన్షన్ కు అర్జీల గడువు పెంచాలని కోరారు. రాష్ట్రంలో లక్షలాదిమంది గత మూడు సంవత్సరాల నుంచి అర్హత ఉండి పింఛన్ పొందటానికి ఎదురుచూస్తున్న ప్రజానీకానికి ఇబ్బందులు, రాజకీయ వివక్షత లేకుండా రాబోయే స్థానిక సంఘాల ఎన్నికల కోసం తాపత్రయం పడకుండా సామాజిక న్యాయం కోసం ,పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి ఉపయోగంగా ఉండేలా ప్రభుత్వ విధానాలు ఉండాలని కోరారు. కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేయటం వల్ల అనేకమంది అర్హులు పింఛన్లు కు దూరమవు తున్నారని ,రేషన్ కార్డు ,ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ సదరం సర్టిఫికెట్, ఓటరు గుర్తింపు కార్డు, వంటి పత్రాలను ప్రామాణికంగా పరిగణించాలని సంఘం జిల్లా కార్యదర్శి శీలం నారాయణరావు కోరారు. ఆధార్ అప్ డేట్ అద్దె దారులకు విద్యుత్ బిల్లులు వంటి నిబంధనలతో పింఛన్ మంజూరు ప్రక్రియ కఠిన తరం చేయడం ,వయోపరిమితిని గతంలో ఉన్న 35 ఏళ్లకు పునరుద్ధరించాలని, గతంలో రెవెన్యూ శాఖ జారీ చేసిన ఒంటరి మహిళా ధ్రువీకరణ పత్రాలు కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. కుల ధృవీకరణ పత్రం ఒకసారి జారీ అయితే వ్యక్తి కులం మారదు, గతంలో జారీ చేసిన చెల్లుబాటు అయ్యే కుల ధ్రువీకరణ పత్రాలను పింఛన్ దరఖాస్తుకు స్వీకరించకుండా.. ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ పింఛను వచ్చేలా నిబంధనలను సడలించాలని ఆయన కోరారు.

నేల పరీక్ష ఆధారంగా ఎరువులు ఉపయోగించాలి సీనియర్ శాస్త్రవేత్త డా. పద్మావతి

ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ఆధ్వర్యంలో "సమగ్ర పోషక యాజమాన్యం"పై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సు నేటితో ముగియునున్నది. ఈ సర్టిఫికెట్ కోర్సులో నేల పరీక్ష ఆధారంగా ఎరువుల వినియోగించాలని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జే. పద్మావతి పేర్కొన్నారు. సేంద్రియ వనరుల వినియోగం, జీవన ఆమె మాట్లాడుతూ ఎరువుల ప్రాధాన్యత, సూక్ష్మ పోషకాల నిర్వహణ, పంటల వారీగా సమతుల్య ఎరువుల యాజమాన్యం స్థిరమైన వ్యవసాయ పద్ధతులు వంటి అంశాలపై శిక్షణ అందించనున్నారు. వివిధ మండలాల నుండి మొవ్వ, పమిడిముక్కల, మచిలీపట్నం, పెడన, మోపిదేవి, చల్లపల్లి అవనిగడ్డ, కోడూరు నుండి సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్సు శిక్షణ సభ్యులు పాల్గన్నారు. సమగ్ర పోషక యాజమాన్యం పై నేలలో సేంద్రీయ కార్బన శాతం పెంపొందించుటకు వివిధ సేంద్రీయ ఎరువులు గురించి వివరించారు. ప్రాముఖ్యత, వివిధ రకాల ఎరువులు సమగ్ర పోషక యాజమాన్యం వలన ఉపయోగాలు వివరించారు. మండల వ్యవసాయ అధికారి, బి .సురేష్ బాబు నాయక్, మొవ్వ ఎరువుల లైసెన్స్ నిబంధనలు గురించి వివరించారు. సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్సు శిక్షణ సభ్యులు పాల్గన్నారు.

కొడాలిలో దోమల నివారణకు ఫాగింగ్

ఘంటసాల, శ్రీ వార్త న్యూస్ : మండల పరిధిలోని కొడాలి గ్రామపంచాయతీ పరిధిలో దోమల బెడదను నివారించేందుకు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్లయుశీ ధ్వర్యంలో ఫాగింగ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, నివాస ప్రాంతాలు దోమల వ్యాప్తికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేపట్టారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా దోమల నియంత్రణకు పంచాయతీ తరఫున అవసరమైన చర్యలు నిరంతరం చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షులు కోన రాజశేఖర్, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సిపిఎం నాయకులు పరామర్శ.

ఘంటసాల, శ్రీవార్త న్యూస్ :మండల పరిధిలోని లంకపల్లిలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో అగ్ని ప్రమాదం బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. లంకపల్లి గ్రామంకు చెందిన మొహమ్మద్ రఫీ పూరింటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం జరగడంతో మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో పక్కనే ఉన్న షేక్ సలీమ్ ఇంటికి కూడా అంటుకోవడంతో రెండు పూరిళ్లు దగ్ధం కావటంతో భారీగా మంటలు చెలరేగి పూర్తిగా బుగ్గిపాలయ్యి రెండు కుటుంబాల వారు నిలువ నీడ లేకుండా కట్టుబట్టలతో మిగిలిపోయారు.సిపిఎం నాయకులు మండల కార్యదర్శి మేడంకి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరిముల్లా, కుంపటి బాబురావు పరామర్శించిన నాయకులు. స్వచ్ఛంద సంస్థలు ఈ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. టిడిపి పార్టీ నాయకులు గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కొమ్మారెడ్డి లీలా కృష్ణయ్య, కొల్లూరి సాయి రాంబాబు, పరిశే చలపతి, అరుణ, శృతి, లంక బాబు, రామకృష్ణ నిత్యవసర వస్తువులను అందజేశారు. బాధితులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

శవాన్ని మోస్తున్న బంధువులు

శవయాత్రకు దారిలేదు దారి చూపండి.వసుమట్ల గ్రామస్తులు

చనిపోయునోడి స్వర్గప్రాప్తి ఏమోగాని కాటికి మోసేవాడికి నరకం కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

జాతీయ నేతలు పుట్టిన అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ దుస్థితి రాష్టంలో ఎక్కడ ఉండదు

అవనిగడ్డ సెప్టెంబర్ 8 శ్రీ వార్త అవనిగడ్డ గ్రామ పంచాయతీ శివారు వసుమట్ల గ్రామం దళితుల దుస్థితి ఇది. జీవితమంతా ఎలా బతికినా కాటికి నడిచే నాలుగు అడుగుల దారైనా సవ్యంగా ఉండేలా చెయ్యమని నియోజకవర్గ పాలకులను వసుమట్ల గ్రామస్తులు వేడుకుంటున్నారు.వసుమట్ల గ్రామస్తులకు స్మశానానికి వెళ్ళే దారిలేక కృష్ణా నదిపై నిర్మించిన వంతెన కరకట్టపైనుండి తాడిచెట్టంత లోతు కిందకు నిలువుగా పాడె మోస్తూ కిందకు దిగడం అంటే నరకం చూస్తున్నారు. వర్షం పడితే ఇక చెప్పడానికి మాటలు సరిపోవు.ఎన్నికల సమయంలో ప్రధాన పార్టీ నేతలు చేసిన వాగ్దానం నీటిమేద రాతలుగా మాయమైపోయాయని ఆవేదన చెందుతున్నారు.75 సంవత్సరాలు వృద్ధుడు చనిపోవడంతో అతని మంగళవారం శవయాత్రతో ఈ విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది.జిల్లా కలెక్టర్ వారైనా ఈ సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

రైతులకు సాగునీరు అందించాలి

అవనిగడ్డ సెప్టెంబర్ 8 శ్రీ వార్త రైతులకు సాగు నీరు అందించాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయం ఇబ్బందిగా ఉంది నీళ్లు ఇవ్వండి అని అడుగుతున్న రైతులు ఇవ్వడం లేదని పులిచింతల నుండి 3000 లేదా 4000 క్యూసెక్కుల నీరు అందిస్తే కృష్ణ డెల్టాకు ఇబ్బంది లేకుండా పోతుందని కానీ 2027 జూన్ వరకు నీరు ఇవ్వలేమని చెప్పడం ఆసియాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ రైతులు నీరు ఇవ్వండి అని అడుగుతుంటే రకరకాలుగా మాట్లాడుతున్నాడని కూటమి ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యే మండలి మంత్రి నిమ్మల రామానాయుడు కి నీరు ఇవ్వమని లెటర్ రాయడం గా ఉందన్నారు. పులిచింతలలో 29 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ ఇవ్వకుండా రైతులను మోసం చేస్తున్నారని రైతంగానికి ఇబ్బందులు లేకుండా ఆఖరిబట్టు వరకు నీరు ఇచ్చిన ఘనత గత వైసిపి ప్రభుత్వానిదే అన్నారు. రైతులకు నీరు అవసరం అని అడుగుతుంటే ఏవేవో కబుర్లు చెబుతున్నారు కానీ వారికి మాత్రం నీరు అందించడం లేదని అన్నారు. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన నీటి కొరత ఏర్పడుతుందని కృష్ణా డెల్టా రైతులకు పూర్తిగా అర్థమైందన్నారు. ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకోకుండా ఆఖరుకు సముద్రంలోనికి వదిలే పరిస్థితులకు సిద్ధమవుతున్నారన్నారు. రైతులకు సరిపడా నీరు ఇవ్వకుండా కల్లబొల్లి కబురులు చెబుతూ కృష్ణ డెల్టాని నాశనం చేసేందుకు కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని సింహాద్రి అన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి నీరు ఇచ్చి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో అవనిగడ్డ జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ (లచ్చి) వైసీపీ కృష్ణా జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు. అవనిగడ్డ పార్టీ మండల కన్వీనర్ రేపల్లి శ్రీనివాసరావు. ఎంపీటీసీ తోట గణేష్. వైసిపి రైతు విభాగం కృష్ణాజిల్లా కార్యదర్శి సామర్ల రాముడు. కోడూరు మండల వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వంకాయల రామకృష్ణ. వైసిపి మాచవరం గ్రామ యూత్ కన్వీనర్ ముత్తిరెడ్డి శివ. వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గరికిపాటి కృష్ణారావు లతోపాటు పలువురు పాల్గొన్నారు,

ప్రొద్దుటూరులో కమీషనర్ ఆకస్మిక తనిఖీలు.. ప్లాస్టిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 8:ప్రొద్దుటూరులో కమీషనర్ ఆకస్మిక తనిఖీలు.. ప్లాస్టిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 8:ప్రొద్దుటూరు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కాఫీ, టీ హోటళ్లతో పాటు పలు వ్యాపార సంస్థలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పలుచోట్ల భారీగా చెత్త, చెదారం పేరుకుపోయినట్లు గుర్తించి సంబంధిత నిర్వాహకులను హెచ్చరించారు .పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు చేపట్టిన మొదటి దశ చర్యలు విజయవంతమయ్యాయని అధికారులు తెలిపారు. జూలై 27 నుంచి ఆగస్టు 20 వరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, చైతన్య ర్యాలీలు నిర్వహించి ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై వివరించారు.ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరులో రెండో దశ ప్లాస్టిక్ నివారణతో పాటు సమగ్ర పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. స్థానిక వ్యాపారులకు సుమారు 45 రోజుల పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయడానికి అవకాశం కల్పించినప్పటికీ, ఇంకా కొందరు నిబంధనలు పాటించడం లేదని అధికారులు పేర్కొన్నారు.ప్రజల్లో మార్పు ప్రారంభమైనప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం కారణంగా పట్టణ పారిశుధ్య పరిస్థితి దెబ్బతింటోందని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు.ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఇకపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనా చేశారు.ప్రొద్దుటూరు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కాఫీ, టీ హోటళ్లతో పాటు పలు వ్యాపార సంస్థలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పలుచోట్ల భారీగా చెత్త, చెదారం పేరుకుపోయినట్లు గుర్తించి సంబంధిత నిర్వాహకులను హెచ్చరించారు.పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు చేపట్టిన మొదటి దశ చర్యలు విజయవంతమయ్యాయని అధికారులు తెలిపారు. జూలై 27 నుంచి ఆగస్టు 20 వరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, చైతన్య ర్యాలీలు నిర్వహించి ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై వివరించారు.ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరులో రెండో దశ ప్లాస్టిక్ నివారణతో పాటు సమగ్ర పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. స్థానిక వ్యాపారులకు సుమారు 45 రోజుల పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయడానికి అవకాశం కల్పించినప్పటికీ, ఇంకా కొందరు నిబంధనలు పాటించడం లేదని అధికారులు పేర్కొన్నారు.ప్రజల్లో మార్పు ప్రారంభమైనప్పటికీ కొంతమంది నిర్లక్ష్యం కారణంగా పట్టణ పారిశుధ్య పరిస్థితి దెబ్బతింటోందని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఇకపై కఠిన చర్యలు తప్పవని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్పష్టం చేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మంగళగిరిలో టిడిపి లీడర్షిప్ కాంక్లేవ్

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.

కళ్యణదుర్గం ప్రతినిధి బి గోవిందు సెప్టెంబర్ 8మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కాంక్లేవ్‌లో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొన్నారు. సహచర ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే సురేంద్రబాబు కాంక్లేవ్‌కు హాజరయ్యారు. టీడీపీ నాయకత్వం, పార్టీ బలోపేతం, ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించే అంశాలపై కాంక్లేవ్‌లో చర్చలు జరుగుతున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి సంబంధించిన అంశాలతో పాటు పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై కూడా నాయకులు దృష్టి సారించారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రజల మనసు గెలుస్తున్న తిరువూరు ఆర్డీవో!

సమస్యలు వింటూ... పరిష్కార మార్గాలు చూపుతూ... 'శభాష్' అనిపించుకుంటున్న ఏ.కుమార్

విజయవాడ, శ్రీ వార్త న్యూస్:అధికారి అంటే కేవలం కార్యాలయంలో కూర్చుని ఫైళ్లను పరిశీలించే వ్యక్తి కాదు... ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యను తెలుసుకొని, పరిష్కారానికి చొరవ చూపే వ్యక్తి. ఈ విధానాన్ని ఆచరణలో చూపిస్తూ తిరువూరు ఆర్డిఓ ఏ. కుమార్ ప్రజలతో మమేకమవుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను ఓపికగా వింటూ... అవసరమైన వివరాలను తెలుసుకొని పరిష్కార మార్గాలను సూచించడం ఆర్డిఓ పనితీరులో ప్రత్యేకతగా నిలుస్తోంది. సమస్యను విన్నామా.... వదిలేసామా అన్న ధోరణికి భిన్నంగా పరిష్కారం దిశగా అధికార యంత్రాంగాన్ని కదిలించే ప్రయత్నం చేస్తున్నారు. కార్యాలయానికే పరిమితం కాకుండా డివిజన్ పరిధిలో పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నారు. గ్రామాలు మండలాల్లో ప్రజలతో నేరుగా మాట్లాడడం ద్వారా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన... సమస్యపై అవగాహన... పరిష్కారానికి చర్యలు అనే విధానంతో ముందుకు సాగుతున్న తీరు ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది. ప్రజా సమస్యలను వినడం కంటే వాటికి పరిష్కారం చూపటమే ముఖ్యమన్న దృక్పథంతో ఆర్డీవో వ్యవహరిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి అవసరమైన మార్గాలను సూచించడం ద్వారా ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు.

అవార్డుతో గుర్తింపు... ప్రజల ప్రశంసలతో మరో గుర్తింపు

తిరువూరు ఆర్డీవో ఏ. కుమార్ కు ఇప్పటికే రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉత్తమ ఆర్డివోగా అవార్డు లభించింది. అధికారిక స్థాయిలో వచ్చిన ఈ గుర్తింపుతో పాటు ప్రస్తుతం ప్రజల మధ్య ఆయనకు లభిస్తున్న ప్రశంసలు కూడా పరిపాలన విధానానికి మరో కొలమానంగా నిలుస్తున్నాయి. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, క్షేత్రస్థాయిలో పర్యటించడం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవడం, పరిష్కార మార్గాలను చూపించడం... ఇవన్నీ ప్రజా పరిపాలనలో కీలకమైన అంశాలు. ఈ విధానాన్ని ఆచరణలో చూపిస్తున్న తిరువూరు ఆర్డీవో ఏ. కుమార్ తీరు అధికార యంత్రాంగానికి ఆదర్శంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల సమస్యలకు స్పందించే అధికారి ప్రజల గుండెల్లో నిలుస్తారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకునే అధికారి మరింత చేరువవుతారు. సమస్యకు పరిష్కార మార్గం చూపే అధికారి మాత్రం ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటారు. తిరువూరు ఆర్డీవో ఏ. కుమార్ పనితీరులో ఈ మూడు అంశాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానంతో ముందుకు సాగుతున్న ఆర్డీవో ఏ. కుమార్ కు ప్రజల నుంచి వస్తున్న స్పందన ఒక్కటే చెబుతోంది... "శభాష్ ఆర్డీవో సార్... అని అంటున్నారు.

కైకలూరు పంచాయతీలోని పలు వార్డులోని సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు చర్చించారు.

ఏలూరు జిల్లా, కైకలూరు, సెప్టెంబర్ 8)08/09/2026 ఈరోజు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్ కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ కైకలూరు మండలం కైకలూరు పంచాయితీ కార్యాలయం నందు మరియు ఎన్జీవోఎస్. కాలనీ లోని రామకృష్ణ సేవా సమితి నందు కైకలూరు పంచాయితీలోని పలు వార్డులలోని సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులతో చర్చించారు. కైకలూరు పంచాయతీ కార్యాలయం మరియు ఎన్జీవో.కాలనీలోని రామకృష్ణ సేవా సమితి

ఆవరణలో జరిగిన సమావేశానికి సంబంధించిన ముఖ్యాంశాలు:రోడ్లు అండ్ డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం: ప్రధానంగా వినిపిస్తున్న సీసీ రోడ్లు మరియు సీసీ డ్రైన్ల నిర్మాణ సమస్యలను (వి బి జి రాంజీ) పథకం ద్వారా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.మౌలిక వసతులపై అధికారులకు ఆదేశాలు: మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళన, చెత్త సేకరణ మరియు డంపింగ్ యార్డ్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు.అభివృద్ధి పనుల్లో ప్రజా భాగస్వామ్యం: పంచాయతీ మరియు ప్రభుత్వ శాఖల పరిధి దాటి మిగిలి ఉన్న అభివృద్ధి పనులను సొసైటీల్లో క్రియాశీలకంగా పనిచేసే సభ్యులకు అప్పగించి పూర్తి చేయిద్దామని సూచించారు.పాల్గొన్నవారు: ఈ కార్యక్రమంలో ఎన్డీఏ (ఎన్ డి ఏ) కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు పార్లమెంట్ జనసేన సమన్వయ కమిటీ సభ్యునిగా నారా శేషు నియామకం పట్ల

కాపు నేత పులి శ్రీరాములు హర్షం

ఏలూరు జిల్లా, ఏలూరు, సెప్టెంబర్ 8 ఎప్టెంబర్ 8; ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ జనసేన సమన్వయ కమిటీ సభ్యునిగా నారా శేషు నియామకం పట్ల కాపుసంక్షేమ సేవాసంఘ వ్యవస్థాపక అద్యక్షులు పులి శ్రీరాములు హర్షం ప్రకటించారు.మెగా ఫ్యామిలి అభిమానిగా, చిరకాలంగా పలుసేవా కార్యమాలు నిర్వహించిన నిస్వార్థ పరుడైన నారా శేషు తన పదవికి న్యాయం చేస్తారని ,ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ భావజాలం నింపుకుని కూటమి పార్టీల మధ్య సమన్వయం సాధిస్తారని పులి శ్రీరాములు పేర్కొన్నారు.అబ్దుల్ కలాం"అంతర్జాతీయ పురస్కారగ్రహీత అయిన నారా శేషు ను మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని పులి శ్రీరాములు అభిలషించారు-పులి శ్రీరాములు.

ఏలూరులో ట్రాఫిక్ కష్టాలు

ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ వద్ద అరగంటగా నిలిచిపోయిన ట్రాఫిక్ కాలేజీలు, విద్యాసంస్థలు వదిలే సమయం కావడంతో భారీగా పెరిగిన వాహనాల రద్దీ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై వాహనదారుల ఆవేదన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు పవర్‌పేట రైల్వే స్టేషన్ పరిసరాల్లో నిలిచిపోయిన వాహనాలతో ఏర్పడిన తీవ్ర రద్దీ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సజావుగా సాగేలా తక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారుల విజ్ఞప్తి

ఈనెల 16వ తేదీ వరకు

నూతన పెన్షన్ల నమోదు ప్రక్రియ-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు జిల్లా, ఏలూరు, సెప్టెంబర్ 8ఏలూరు, సెప్టెంబర్,8 ఏలూరు జిల్లాలో 'ఎన్టీఆర్ భరోసా' (ఎన్టీఆర్ భరోసా) నూతన పింఛన్ల నమోదు ప్రక్రియ ఈ నెల 16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం / స్వర్ణ వార్డు లలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా పింఛను కోసం నమోదు (రిజిస్ట్రేషన్) చేసుకోవాలనుకునే అర్హులైన ప్రజలు తమ సమీప స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డులలో డిజిటల్ అసిస్టెంట్లు (డిజిటల్ అసిస్టెంట్స్) లేదా వార్డు ఎడ్యుకేషన్ ఒ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులను (వర్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీస్) నేరుగా సంప్రదించి ఆధార్ కార్డు తో పాటు గా అవసరమైన ఇతర అర్హత/ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కల్లెకర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

ఐఎఫ్టియు ఆధ్వర్యంలో వాల్ పోస్టర్, సదస్సు కరపత్రాలు ఆవిష్కరణ

ఏలూరు జిల్లా, ఏలూరు, సెప్టెంబర్ 8కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 12వ తేదీన ఏలూరులో జరగబోవు సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, ఐఎఫ్టియు. రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాలు మరియు వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం ఈరోజు అనగా 08-09-2026 న ఐ ఎఫ్ టి యు. అనుబంధ ఏపీ బేవరేజ్ హమాలీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఏలూరులో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఎఫ్టియు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధానలి కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ...ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ , కనీస వేతనం రూ. 30,000/- చేసి అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ ఎస్ ఐ , పీఫ్ , అమలు చేయని చోట అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్మికుల ఐక్యతే వారి బలమని, ఈ నెల 12న జరిగే కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రంగాల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆప్కాస్ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో భవిష్యత్తులో కార్మిక వర్గం పోరాటాన్ని చవిచూడవలసిస్తాదని ఆచరించినారు.ఈ కార్యక్రమంలో ఏపీ బేవరేజ్ హమాలీ కార్మికులు రాచేటి జాను పాండురంగారావు ఆనందు కోటేశ్వరరావు సూర్యనారాయణ శ్రీనివాసు గంగాధర్ సత్యనారాయణ వెంకటేశ్వరరావు శ్యామల రావు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఘటనపై విశాఖపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జర్నలిస్టుల ఆందోళన.

ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా విశాఖ జిల్లా అధ్యక్షులు రాజు.

విశాఖపట్నం సెప్టెంబర్ -08(జిల్లా ఇంచార్జ్.నంద్యాల జిల్లాలో ఐ న్యూస్ రిపోర్టర్ల అరెస్టుపై విశాఖలో జర్నలిస్టులు మండిపడ్డారు ఏపీయూడబ్ల్యూజే ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు వాస్తవాలు వార్తలుగా రాసే జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడానికి జర్నలిస్టులు ఖండించారు ఈ సందర్భంగా ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులవలస రామచంద్రరావు మాట్లాడుతూ పత్రిక స్వేచ్ఛ హరించే ప్రయత్నాలు ఐ న్యూస్ రిపోర్టర్లు అరెస్ట్ లో స్పష్టంగా కనిపించిందని అన్నారు దీనిపై జిల్లా న్యాయమూర్తి సుమోటాగా పోలీసులపై విచారణకు ఆదేశించాలని కోరారు ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా విశాఖ జిల్లా అధ్యక్షులు రాజు మాట్లాడుతూ రాసే అంశాలను పక్కనపెట్టి జర్నలిస్టులపై కేసులు పెట్టడం అన్యాయం అన్నారు అసలు ఆ షాడో మంత్రిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా విశాఖ జిల్లా కోశాధికారి సూర్యప్రకాష్ మాట్లాడుతూ జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నం సమాజానికే ప్రమాదకరం అన్నారు రిపోర్టర్లకు జర్నలిస్టు సంఘాలు మద్దతుగా నిలుస్తాయని వారి కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఐ న్యూస్ బ్యూరో చీఫ్ రాజు.. విశాలాంధ్ర బ్యూరో చీఫ్ రామకృష్ణ.. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఉదయ్ కుమార్ . చందు.గంగాధర్ కమాలుద్దీన్ మౌలానా భరత్ తిరుపతి. తదితరులు పాల్గొన్నారు

కొత్త పెన్షన్లు కోసం సెప్టెంబర్ 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..ఎంపీడీవోమణికుమారి..

ఆన్లైన్ ప్రక్రియను,చెత్త నుండి సంపద తయారుచేసే కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో..

పోలవరం, సెప్టెంబర్ 8 కొత్త పెన్షన్లు కోసం దరఖాస్తు చేసుకొనేందుకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ల కోసం ఆన్లైన్ ద్వారా నమోదు చేయించుకోవాలని పోలవరం ఎంపీడీవోమణికుమారి సూచించారు..ఈ సందర్భంగా పోలవరం 3 సచివాలయములో ఆన్లైన్ ద్వారా నమోదు చేస్తున్న కొత్త పెన్షన్లు విధి విధానాలను ఎంపీడీవోమణికుమారి మంగళవారం స్వయంగా

పరిశీలించారు.. అనంతరం చెత్త నుండి సంపద తయారుచేసే కేంద్రాన్ని పరిశీలించి పంచాయతీ అధికారులకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పోలవరం 3 సచివాలయంలో మొత్తం 16 దరఖాస్తులు రాగా 6 ఆన్లైన్ చేయడం జరిగిందనిమొత్తం పోలవరం మండలంలో మంగళవారం 548 దరఖాస్తులు రాగా 136 ఆన్లైన్ చేయడం జరిగిందనితెలిపారు.. సచివాలయానికి వచ్చిన ప్రతి ఒక్కరి దరఖాస్తును త్వరితగతిన ఆన్లైన్ చేయాలని డిజిటల్ అసిస్టెంట్ లకు ఆదేశాలు జారీ చేశారు.. ఈనెల 16 వ తేదీ వరకు ఆన్లైన్ చేయుటకు అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు..

షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి...

-దేవరకద్ర పోలీస్ స్టేషన్ లో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు...

దేవరకద్ర సెప్టెంబర్ 8 షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు దేవరకద్ర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై షాద్ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. కేసీఆర్ చనిపోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలు పట్ల బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న ఒక ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని వారు మండిపడ్డారు.ఈ వ్యాఖ్యలకు నిరసనగా మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.దేవరకద్ర పోలీస్ స్టేషన్‌లో స్థానిక ఎస్ఐ భాస్కర్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే ఆయన శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని,రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా దూషించడం లేదా మరణాన్ని కోరుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.తమ ఫిర్యాదుపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరిన బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ డోకూర్ నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కొండా రెడ్డి, మధు, కొండల్, సిరాజ్, యాదయ్య, అడ్డు, ఆంజనేయులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకుల నిరసన..

దేవరకద్ర సెప్టెంబర్ 8 శాసనసభ సభాపతి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీల తీరును ఖండిస్తూ మంగళవారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను కించపరిచే విధంగా బిఆర్ఎఫ్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్ రెడ్డిలు చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా పాలనతో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో దూసుకు పోతుండడంతో బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ ప్రజల్లో చిచ్చు రేపుతున్నారని పరువు విమర్శించారు. శాసనసభాపతిని కించపరిచిన ఎమ్మెల్సీలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, నాయకులు నాగరాజు, బాలరాజు, బీరప్ప, రామాంజనేయులు, భీమన్న, సత్యం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎం ఆర్ పి ఎస్ నాయకులు విజయవాడలో.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ కులాల చైర్మన్,కోత్తపల్లి శామ్యూల్ జవహర్ ని కలవడం జరిగింది

తాడిపత్రి నియోజకవర్గం సెప్టెంబర్ 8: మరియు షెడ్యూల్ కులాల కమిషన్ మెంబర్ మేకల బిక్షం . జయవాడలోని తన కార్యాలయం చాంబర్ లో కలిసి తాడిపత్రి మండలం రావి వెంకటంపల్లి గ్రామానికి చెందిన వై కుళ్లాయప్ప కు 1976 లో పెద్ద పోడమల గ్రామ పొలంలోని సర్వే నెంబర్ 1303 లో 2 ఎకరాల 33 సెంట్లు భూమిని సీలింగ్ ల్యాండ్ కింద సాగు పట్టా మంజూరు చేసిన భూమిని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన లక్కం ఓబులమ్మ తన కూతురైన నార్పల మండలం గడ్డనాగేపల్లి గ్రామానికి చెందిన

బుసగాని లక్ష్మి పేరుతో ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి రెవెన్యూ రికార్డుల ఎక్కించుకున్న విషయం పైన గత ఆరు సంవత్సరాల నుంచి వై కుళ్లాయప్ప పక్షాన ఎమ్మార్పీఎస్ నాయకులుపి రాజారత్నం మాదిగ అన్ని ఆధారాలను సేకరించి ఎమ్మార్వో. మొదలుకొని కలెక్టర్ . వరకు అన్ని ఆధారాలతో కలిసి రికార్డును సబ్మిట్ చేసిన వై కుళ్లాయప్ప పేరుమీదఇంతవరకు తిరిగి రెవిన్యూ రికార్డులో చేర్చకుండా కాలయాపన చేస్తున్న రెవిన్యూ అధికారుల పైన బాధితుడైన కుళ్లాయప్పతో కలిసి ఫిర్యాదు చేసిన మరియు ఇదే విషయం పైన పి రాజారత్నం మాదిగ అనంతపురం రెవిన్యూ డివిజనల్ అధికారి నీ తాడిపత్రి ఎమ్మార్వో. ఆఫీసులో అడిగితే పబ్లిక్ ఆఫీసర్ అయి ఉండి పబ్లిక్ లో చెప్పుకోలేని పదా జ్వాలాలతో మాట్లాడుతూఅవమానపరిచిన విషయం పైన కూడా గౌరవ షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కు ఫిర్యాదు చేయడం జరిగినది కలిసినవారు తాడిపత్రి నియోజకవర్గ ఎం.ఆర్.పి.ఎస్. సీనియర్ నాయకులు పి రాజారత్నం మాదిగ ఎంపీ పుల్లయ్య మాదిగ వై కుళ్లాయప్ప

77వసారి రక్తదానం చేసిన లాలం చందు

రాంబిల్లి మండలం సెప్టెంబర్ 08)రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామానికి చెందిన లాలం చందు రక్తదానం చేయడంలో మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంకులో ఆయన 77వసారి రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఇబ్బందులు పడుతున్న వారికి తన వంతు సాయం అందించాలనే ఉద్దేశంతో, ఎన్నో ఏళ్లుగా ఆయన క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం ఉంటుందని చందు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి, ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. 77 సార్లు రక్తదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన లాలం చందును పలువురు ప్రముఖులు, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది అభినందించారు.

ఓపెన్ కాస్ట్‌మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండాలి

సింగరేణి సంబంధిత అన్ని శాఖల అధికారులతోసమావేశం నిర్వహించిన.

జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

ములుగు :-ప్రతినిధిర్‌యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా వెంకటాపూర్ మండల

పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వల్ల కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారుఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ పర్యావరణం శాస్త్రీయ అధ్యయనాలు నిరంతర పర్యవేక్షణతోపాటు సంబంధిత నిబంధనలు భద్రతా ప్రమాణాల పై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎం జి. దేవేందర్, పర్యావరణ విభాగం జీఎం పి. సైదులు ఎక్స్‌ప్లోరేషన్ జీఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఆర్. సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి. గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్ ఎం.ఎస్ వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధులు జె. శ్రీధర్‌రావు ఆచార్య ఎం.పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సీహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె. వెంకయ్య జిల్లా మత్స్యశాఖ అధికారి రజని జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం. శివాజీ, ఇర్రిగేషన్ ఈ ఈ నారాయణ, వెంకటాపూర్ తహసిల్దార్ గిరిబాబు, ఎం పి డి ఓ రాజు సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

జేఏసీ కన్వీనర్ స్వరూప్ సింగ్ పిలుపు



వాజేడు సెప్టెంబర్ 08సెప్టెంబర్ 10వ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని అత్యంత విజయవంతం చేయాలని వాజేడు మండల జేఏసీ కన్వీనర్ స్వరూప్ సింగ్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉద్యోగుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ (వేతన సవరణ), ఆరు డీఏ (కరువు భత్యం)లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా సీపీఎస్ (సిపిఎస్) ఉద్యోగులందరినీ ఓపీఎస్ (పాత పింఛను విధానం) పరిధిలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం నుంచి ఖచ్చితమైన హామీ లభించే వరకు పోరాటం తప్పదని పేర్కొన్నారు. కావున ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కంచు ప్రభాకర్, రామన్న, జానకిరామ్, జేఏసీ మండల సహ కన్వీనర్లు సతీష్ కుమార్, రాజేష్, బాలాజీ, శ్రీకాంత్, రాజు, మైబెల్లీ, చంద్రమౌళి తదితర ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల చిరుతపల్లి-2లో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు

చదువుదాం.... ఎదుగుదాం.... దేశాన్ని అభివృద్ధి చేద్దాం.....

చదువే వెలుగు -- అక్షరాస్యతే అభివృద్ధికి తొలిమెట్టు

వాజేడు సెప్టెంబర్ 08 ?అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల చిరుతపల్లి-2లో విద్యార్థినులతో వివిధ అవగాహన మరియు విద్యా కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. ఉష మాట్లాడుతూ, అక్షరాస్యత అనేది కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, జ్ఞానాన్ని సంపాదించి జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకునే శక్తిని అందించే గొప్ప సాధనమని తెలిపారు. ప్రతి బాలిక విద్యను తమ హక్కుగా భావించి, నిరంతరం చదువుతూ తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు.అనంతరం విద్యార్థినులకు చదవడం, రాయడం, పదజాల అభివృద్ధి, వాక్య నిర్మాణం, కథల పఠనం, క్రమరహిత పదాలతో వాక్య నిర్మాణం, తప్పిపోయిన అక్షరాలను పూరించడం, గణిత అక్షరాస్యత మరియు సాధారణ జ్ఞానానికి సంబంధించిన వివిధ విద్యా కార్యకలాపాలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని కథలు చదవడం, పదాలను గుర్తించడం, కొత్త పదాలతో వాక్యాలు నిర్మించడం వంటి కార్యక్రమాల ద్వారా తమ భాషా మరియు అభ్యాస నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "ప్రతి రోజు ఒక కొత్త విషయం నేర్చుకుందాం -- చదువుతో మన జీవితాన్ని మార్చుకుందాం" అనే సందేశాన్ని అందించారు. గిరిజన ప్రాంతాల్లో ప్రతి బాలికకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా అక్షరాస్యతతో పాటు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సామాజిక అవగాహన పెంపొందించవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుజన్ కుమార్, వినోద, శైలజ,సంధ్యారాణి, నవీన్, రామదాస్, వీరన్న, సరస్వతి, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు విశేషంగా పాల్గొన్నారు.ర

ప్రజా సమస్యల పరిష్కారానికి మూకమామిడిలో వార్డు సభలు....

సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం...

అశ్వరావుపేట ఆర్సీ/ సెప్టెంబర్ 8 (:గ్రామంలోని ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (విజిపిపి) లో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించడమే కాకుండా.ప్రతి వార్డులోకి వెళ్లి వార్డు సభలు నిర్వహించారు.ప్రతి వార్డులో పనులు గుర్తించి రాబోయే మూడు సంవత్సరాలకు ప్రణాళిక ఏర్పాటు కొరకు మరియు వార్డులలో పర్యటించి అక్కడి ప్రజలతో మమేకమై వారి సమస్యలైన రోడ్లు,డ్రైనేజీ,తాగునీరు,వీధి దీపాలు,పింఛన్లు,ఇళ్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.వారి నుండి వినతులను స్వీకరించి రిజిస్టర్లో నమోదు చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ.గ్రామసభ

అంటే ప్రజలు మా దగ్గరకు రావడం.వార్డు సభ అంటే మేము ప్రజల దగ్గరకు వెళ్లడం.ప్రజల సమస్యలు వారి వీధుల్లోనే ఉంటేనే సరిగ్గాఅర్థమవుతాయి.అందుకే వార్డుల్లో సభలు పెడుతున్నాము.వచ్చిన ప్రతి సమస్యను రాబోయే మూడేళ్ల (విజిపిపి) ప్రణాళికలో చేర్చి పరిష్కరిస్తాము అని అన్నారు.పంచాయతీ పరిధిలో ప్రతి వార్డులో వార్డు సభలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ వార్డు సభలలో పంచాయతీ కార్యదర్శి దోమల అరుణ్ కుమార్, టి.ఏ తాటి సత్యం,వార్డు మెంబర్లు కణితి చిన్న వెంకటేశ్వర్లు,కిసారి రాజ్ కుమార్,తనం పావని,కోర్సా శ్రీకృష్ణ,బచ్చుల చైతన్య కుమారి మరియు ఉపాధిహామీ సిబ్బంది మెట్లు కీసరి గోపాలరావు,కీసరి రామజోగి,గడ్డం రాజబాబు మరియు గ్రామ పెద్దలు కీసరి గోపయ్య,బాబురావు,గడ్డం బాబు,సవలం సత్యనారాయణ,ఎస్.కె అబ్దుల్లా,పున్నం వెంకన్న గ్రామస్తులు పాల్గొన్నారు

బుధవారం లోగ స్వీయ ధ్రువీకరణ పత్రాలు అందించక పోతే సన్న వడ్లకు బోనస్ వర్తించదు ఏఈఓ,సతీష్ కుమార్

మానకొండూర్ సెప్టెంబర్ 8ప్రతినిధి గోపు మహిపాల్ రెడ్డి : తెలంగాణ ప్రభుత్వం

వరి సాగుకు సూచించిన 7 సన్న వరి రకాలలో తమ సొంత విత్తనాలను 2026 వానాకాలంలో వేసిసాగుచేస్తున్నరైతులనుంచిరైతస్వీయధృవీకరణపత్రాలనుగత20రోజులుగాస్వీకరిస్తున్నా మని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) సతీష్ కుమార్ తెలిపారు.ఇప్పటివరకు రైతుల నుంచి స్వీయ ధృవీకరణ పత్రాలుస్వీకరించగాఇంకాకొంతది రైతులు తమ పత్రాలను సమర్పించాల్సి ఉందని ఆయనతెలిపారు.రైతు స్వీయ ధృవీకరణ పత్రంసమర్పించడానికి రేపే చివరి తేదీ అని ఆయన వెల్లడించారు ఇంకా పత్రాలు సమర్పించని సంబంధిత రైతులు రేపు పచ్చునూర్ రైతు వేదికకు వచ్చి రైతు స్వీయ ధృవీకరణ పత్రంతో పాటు పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీనిసమర్పించాలని సూచించారు.రేపటి తర్వాత స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించని రైతులకు బోనస్ వర్తించదు అని ఏఈఓ సతీష్ కుమార్ స్పష్టంచేశారుప్రజా ప్రతినిధులు మరియు రైతు సోదరులు ఈవిషయాన్నిగమనించి,సంబంధిత రైతులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం - 09 - సెప్టెంబర్ - 2026

ప్రపంచంలో ఎటు చూసినా వృద్ధులేనట...అసలు ఊహించగలరా ?

ప్రకృతిలో భాగం మానవాళి కూడా. అక్కడ అన్ని రకాలైన వర్గీకరణలు ఉన్నట్లుగా మానవాళిలోనూ అన్ని రకాలైన వయసు వారు ఉండాలి. అపుడే సృష్టికి అందం, ప్రపంచానికి అభివృద్ధికి అదే కీలకం. అందరూ యువత అయితే ఆవేశం తప్ప ఏమీ మిగలదు, అదే అంతా వృద్ధులు అయితే నైరాశ్యం తప్ప ఉండేది లేదు. అందుకే సమతుల్యమైన జనాభా అంటే అనుభవం కలిగిన వృద్ధులతో పాటు వేడి నెత్తురు కలిగిన యువత కూడా. ఇప్పటిదాకా అలాగే సాగుతూ వచ్చింది కానీ ఇపుడు ఆ గొలుసుకట్టు ఎక్కడో తెగిపోతోంది. ఆ వరసలో తేడా వస్తోంది. ఫలితంగా రానున్న కాలమంతా వృద్ధులదే అవుతోంది. ప్రపంచమే అతి పెద్ద వృద్ధ సమాజంగా మారబోతోంది. తలచుకుంటేనే ఇది ఒకింత కలవరం కలిగిస్తోంది. ఊహకు అందని విధంగా కూడా ఈ ఆవిష్కరణ ఉంది. కానీ ఇదే జరగబోతోంది అని పలు నివేదికలు అయితే స్పష్టం చేస్తున్నాయి.ాశ్రీంశీ =ఘు‌న - అధినేతలు కాదంటున్నా.. కామన్ గా కూటమి కార్యకర్తల కొట్లాట? ప్రపంచ చరిత్రలోనే తొలిసారి : ఈ విధంగా వృద్ధ సమాజం ఆవిష్కరించబడడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి అని అంటున్నారు. అయిదేళ్ల చిన్నారులను మించిన విధంగా వృద్ధులు జనాభా ఉందని గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఇదంతా చాలా నిశ్శబ్దంగా వేగంగా ఇపుడు జరిగిపోతుంది అని అంటున్నారు. దీనికి అనేక కారణాలు ఉన్నాయని అంటున్నారు. ఒక వైపు చూస్తే మానవాళి జీవన ప్రమాణాలు పెరిగాయి. అదే సమయంలోనె జననాలు తగ్గిపోతున్నాయి. ఈ రెండింటి నిష్పత్తిలో భారీ అంతరాయం వల్లనే వృద్ధులు పెరిగి యువత తగ్గిపోతున్న నేపథ్యం ఉందని అంటున్నారు. అందోళనకరమైనా కూడా : వయో వృద్ధులు ఉన్న దేశాలు అతి తొందరలోనె నూటికి తొంబైగా ఉంటాయని అమెరికాకు చెందిన యూఎస్ సెన్సస్ బ్యూరో విడుదల చేసిన యాన్ ఏజింగ్ వరల్డ్- 2025' నివేదిక వెల్లడిస్తోంది. ఈ నివేదిక ప్రకారం చూస్తే అయిదేళ్ల చిన్నారుల కంటే కూడా ప్రపంచంలో 65 ఏళ్లు పైబడిన వారు అధికంగా ఉన్నారని నమోదు అయింది. ఇక ఇదే తీరున అనేక దేశాలలో వేగంగా వృద్ధుల జనాభా పెరిగిపోతోంది అని అంటున్నారు. ఇప్పటికే ఇలా ఉంటే భవిష్యత్తులో మరింత వేగంగా వృద్ధ జనాభా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. దాంతో ప్రపంచా దేశాలలో ఆర్ధిక వృద్ధి నిలిచిపోవడమే కాకుండా అభివృద్ధి సైతం కుంటుపడుతుందని అంటున్నారు. అలాగే సామాజిక వ్యవస్థకు కూడా ఈ పరిణామం అతి పెద్ద సవాల్ గా మారనుంది అని అంటున్నారు.

ఇక యాన్ ఏజింగ్ వరల్డ్- 2025 నివేదిక ప్రకారం చూస్తే కనుక 2025 నాటికే ప్రపంచవ్యాప్తంగా 65 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 85.2 కోట్లుగా ఉంది. అయితే ఇది ఉండనుండగా, 2060 నాటికి అది ఏకంగా 200 కోట్లకు చేరుకుంటుందని ఈ నివేదిక సరిగ్గానే అంచనా వేసింది. దీనిని బట్టి చూస్తే మరో మూడున్నర దశాబ్దాల నాటికి ప్రపంచ జనాభాలో దాదాపు ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే ఉంటారని లెక్క తేలుతోంది. అంటే వృద్ధ సమాజమే ఎటు చూసినా కనిపిస్తుంది అన్న మాట. ఇలా ప్రపంచంలో అనేక దేశాలు తాముగా మానవ వనరులను తగ్గించేసుకుంటాయని అంటున్నారు. రెండు కీలక కారణాలు : ఎందుకు తొందరగా వృద్ధ ప్రపంచం ఆవిష్కరించబడుతోంది అంటే రెండు కారణాలను కీలకంగా ఈ నివేదిక ప్రకారం గుర్తించారు. అందులో మొదటిది ప్రపంచవ్యాప్తంగా సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గడం అని స్పష్టం చేస్తున్నారు. ఈ రోజున ప్రపంచం మైండ్ సెట్ ఎలా ఉంది అంటే కుటుంబాలు పెద్దవి వద్దు తక్కువ మంది పిల్లలే చాలు అన్నట్లుగా తయారైంది. ఈ విధంగా చూస్తే ప్రపంచ జనాభాలో 71 శాతానికి పైగా ప్రజలు నివసిస్తున్న దేశాలలో సంతానోత్పత్తి రేటు భారీగా పడిపోయింది. ఒక మహిళకు సగటున 2.1 జననాలు కంటే దిగువకు పడిపోయిందని చెబుతున్నారు. ఇక రెండవ కారణం చూస్తే అన్ని దేశాలలో మెరుగైన ఆరోగ్య సంరక్షణ విధానాలు అమలు అవుతున్నాయి. దాంతో జీవన ప్రమాణాలు పెరగడం వల్ల ప్రజల ఆయుర్దాయం ఒక్కసారిగా అధికం అయింది. దాంతోనే వృద్ధుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోందని నివేదిక పేర్కొంటోంది. భారత్ మీదనే ప్రభావం : ఈ విధంగా వృద్ధ సమాజం ఏర్పడితే అది అతి పెద్ద దేశాలుగా ఉన్న భారత్ చైనాల మీదనే ప్రభవాం పడుతుంది అని అంటున్నారు. అంతే కాదు అధిక వృద్ధుల పెరుగుదల కూడా ఆసియా, ఐరోపా దేశాల్లో ఎక్కువగా కనిపిస్తోంది అని అంటున్నారు. ఇక ఈ రెండు దేశాల్లోనూ ఇప్పటికే సంతానోత్పత్తి రేటు చాలా తక్కువగా ఉంది అని గణాంకాలు చెబుతున్నాయి. ఇక 2050 నాటికి ఒక్క భారత్‌లోనే 60 ఏళ్లు పైబడిన వారి జనాభా 35 కోట్లకు చేరుకుంటుందని అంచనా ఉంది. అలాగే . ఆసియా మొత్తంలో 2060 నాటికి వృద్ధుల జనాభా 120 కోట్లకు పెరుగుతుందని ఈ నివేదిక పేర్కొంది. కేవలం సంపన్న దేశాలకే కాకుండా ఆఫ్రికా లాంటి ఖండాల్లోనూ 2060 నాటికి వృద్ధుల సంఖ్య 249 కోట్లకు చేరుతుందని కూడా ఈ నివేదిక ప్రకారం అంచనా వేశారు. ఇలా వృద్ధులు పెరిగితే కనుక అధి దేశాల ఆర్ధిక వ్యవస్థలకు పెను ముప్పుగా మారుతుందని అంటున్నారు. మానవ వనరుల కొరతకు దారి తీస్తుందని అంటున్నారు.

బిజీ లైఫ్‌లో వ్యాయామమా?.. ఈ 7 నిమిషాల వర్కవుట్‌తో సాధ్యమే!

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో వృత్తి నిపుణులకు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే సమయం దొరకడం లేదు. సుదీర్ఘ పని గంటలు, మీటింగ్‌లు, ప్రయాణాలు, ఇంటి బాధ్యతల నడుమ వ్యాయామం కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించడం దాదాపు అసాధ్యంగా మారింది. అయితే, సమయం లేదనే కారణంతో శారీరక శ్రమను పూర్తిగా వదిలేయాల్సిన అవసరం లేదు. కేవలం కొన్ని నిమిషాల వ్యాయామం కూడా రోజంతా చురుకుగా ఉంచడానికి, ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా కేవలం 7 నిమిషాల వర్కవుట్ బిజీ షెడ్యూల్‌లో ఉన్నవారికి ఒక అద్భుతమైన మార్గం. డెస్క్ జాబ్ చేసేవారు గంటల తరబడి ఒకేచోట కూర్చోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. అలాంటి వారికి ఈ చిన్నపాటి వ్యాయామం ఒక చక్కటి పరిష్కారం. 7 నిమిషాల వర్కవుట్ యొక్క అతిపెద్ద ప్రయోజనం ఏమిటంటే, వ్యాయామం చేయడానికి అడ్డుగా

ఉండే 'సమయం లేదు' అనే సాకును ఇది తొలగిస్తుంది. దీని కోసం జిమ్‌కు వెళ్లాల్సిన పని లేదు, ఖరీదైన పరికరాలు కొనుగోలు చేయాల్సిన అవసరం అంతకంటే లేదు. ఇంట్లో, ఆఫీస్‌లో చిన్న విరామం దొరికినప్పుడు లేదా ప్రయాణాల్లో హోటల్ గదిలో కూడా ఈ వ్యాయామాలను సులభంగా చేసుకోవచ్చు.

ఏమిటీ 7 నిమిషాల వర్కవుట్?

7 నిమిషాల వర్కవుట్ అంటే కొన్ని రకాల వ్యాయామాలను తక్కువ సమయంలో వేగంగా చేయడం. ఇందులో కార్డియో, శరీర బరువుతో చేసే వ్యాయామాలు, కండరాల కదలికలను మెరుగుపరిచేవి ఉంటాయి. దీనివల్ల శరీరంలోని వివిధ భాగాలకు వ్యాయామం అందుతుంది. కింద సూచించిన వ్యాయామాలను పరికరాలు లేకుండా చేయవచ్చు. ప్రతి వ్యాయామాన్ని 30 సెకన్ల పాటు చేసి, ఆ తర్వాత 15 సెకన్ల విరామం తీసుకుని తర్వాతి వ్యాయామానికి మారాలి.

1. జంపింగ్ జాక్స్: ఇది గుండె వేగాన్ని పెంచడానికి సులభమైన మార్గం. నిటారుగా నిలబడి, కాళ్లను వెడల్పుగా చాస్తూ ఏకకాలంలో చేతులను తల పైకి ఎత్తాలి. తిరిగి యథాస్థానానికి రావాలి. గెంతడం ఇబ్బందిగా అనిపిస్తే, ఒక్కో కాలును పక్కకు జరుపుతూ చేయవచ్చు.

2. బాడీ వెయిట్ స్క్వాట్స్: ఈ వ్యాయామం తొడలు, పిరుదులు, నడుము కండరాలను బలోపేతం చేస్తుంది. కాళ్లను భుజాల వెడల్పులో ఉంచి, కుర్చీలో కూర్చుంటున్నట్లుగా తుంటిని వెనక్కి నెట్టి మోకాళ్లను వంచాలి. ఛాతీని నిటారుగా ఉంచి, నెమ్మదిగా తిరిగి పైకి లేవాలి.

3. పుష్-అప్స్: ఇది ఛాతీ, భుజాలు, చేతులకు బలాన్నిస్తుంది. చేతులను భుజాల కంటే కొంచెం వెడల్పుగా నేలపై ఉంచి, శరీరాన్ని ఒకే సరళరేఖలో ఉంచాలి. ఛాతీని నేల వైపుకు దించి, తిరిగి పైకి నెట్టాలి. కొత్తగా చేసేవారు మోకాళ్లను నేలపై ఆనించి లేదా గోడ సహాయంతో చేయవచ్చు.

4. హై నీస్: ఇది మంచి కార్డియో వ్యాయామం. నిటారుగా నిలబడి, ఒక మోకాలును ఛాతీ వైపుకు పైకి లేపి, వెంటనే మరో మోకాలును పైకి లేపాలి. పరుగెడుతున్నట్లుగా వేగంగా చేయవచ్చు. నెమ్మదిగా చేయాలనుకుంటే మార్చింగ్ లాగా చేయవచ్చు.

5. రివర్స్ లంజెస్: కాళ్లకు బలాన్నివ్వడంతో పాటు శరీర సమతుల్యతను మెరుగుపరుస్తుంది. నిటారుగా నిలబడి, ఒక కాలును వెనక్కి వేసి, రెండు మోకాళ్లు సౌకర్యవంతంగా వంగే వరకు శరీరాన్ని కిందకు దించాలి. ముందు కాలిపై బరువు వేసి తిరిగి పైకి లేచి, మరో కాలితో చేయాలి.

6. ప్లాంక్: పొట్ట, నడుము కండరాలను బలోపేతం చేయడానికి ఇది ఒక అద్భుతమైన వ్యాయామం. మోచేతులను నేలపై ఆనించి, కాళ్లను వెనక్కి చాపి శరీరాన్ని భుజాల నుంచి మడమల వరకు ఒకే సరళరేఖలో ఉంచాలి. పొట్ట కండరాలను బిగబట్టి ఆ స్థితిలో ఉండాలి.

7. గ్లూట్ బ్రిడ్జెస్: ఇది పిరుదుల కండరాలను లక్ష్యంగా చేసుకుంటుంది. వెల్లకిలా పడుకుని, మోకాళ్లను వంచి పాదాలను నేలపై ఉంచాలి. పాదాలతో నేలను నొక్కుతూ తుంటిని పైకి లేపాలి. కొద్దిసేపు ఆగి, నెమ్మదిగా కిందకు దించాలి.

రోజువారీ జీవితంలో ఎలా చేర్చాలి?

మీకు వీలైన సమయంలో ఈ 7 నిమిషాల వర్కవుట్‌ను రోజూ చేయడం ముఖ్యం. ఉదయం పనికి వెళ్లే ముందు, మధ్యాహ్నం భోజన విరామంలో లేదా సాయంత్రం పని ముగిశాక చేయవచ్చు. ఎక్కువ సేపు చేయడం కంటే, క్రమం తప్పకుండా చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయి. అలవాటయ్యాక, ఈ సర్క్యూట్‌ను రెండు లేదా మూడు సార్లు పునరావృతం చేయవచ్చు. మీ షెడ్యూల్, ఫిట్‌నెస్ స్థాయికి సరిపోయేలా ఒక దినచర్యను రూపొందించుకోవడమే ఇక్కడ కీలకం.

ఉల్లి ఘాటు, చికెన్ జోరు.. మళ్లీ పెరిగిన ఇంటి భోజనం ఖర్చు

ఆగస్టులో స్వల్పంగా పెరిగిన ఇంటి భోజనం ఖర్చు

గతేడాదితో పోలిస్తే 5 శాతం పెరిగిన నాన్-వెజ్ థాలీ ధర

ఉల్లి ధరలు 43 శాతం పెరగడమే ప్రధాన కారణమని వెల్లడి

టమాటా, బంగాళాదుంప ధరలు తగ్గడంతో కొంత ఊరట

రానున్న 2-3 నెలలు ఉల్లి ధరలు అధికంగానే ఉంటాయని అంచనా

సామాన్యుడి వంటింటి బడ్జెట్‌పై ధరల భారం మరోసారి పెరిగింది. ఆగస్టు నెలలో గృహావసర భోజనం ఖర్చులు స్వల్పంగా పెరిగినట్లు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'క్రిసిల్' తన తాజా నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా ఉల్లిపాయలు, వంట నూనెలు, బ్రాయిలర్ చికెన్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. క్రిసిల్ 'రోటీ రైస్ రేట్' నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే శాకాహార భోజనం (వెజ్ థాలీ) ధర 1 శాతం పెరిగి రూ. 29.5కి చేరింది. అదే సమయంలో, మాంసాహార భోజనం (నాన్-వెజ్ థాలీ) ధర 5 శాతం పెరిగి రూ. 57.5కు చేరింది. అయితే, జూలై నెలతో పోల్చితే నాన్-వెజ్ థాలీ ధర 1 శాతం తగ్గడం గమనార్హం. ఈ ధరల పెరుగుదలకు ప్రధానంగా ఉల్లి ధరలు ఏకంగా 43 శాతం మేర పెరగడమే ముఖ్య కారణం. మార్చి-ఏప్రిల్ నెలల్లో మహారాష్ట్రలో కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభావంతో సరఫరా తగ్గి ఉల్లి ధర కిలోకు రూ. 40కి చేరింది. వీటికి తోడు వంట నూనెల ధరలు 11 శాతం, ఎల్పీజీ ధరలు 10 శాతం, బ్రాయిలర్ చికెన్ ధరలు 10 శాతం మేర పెరిగాయి. నాన్-వెజ్ థాలీ ప్రియం కావడంలో చికెన్ ధరల పెరుగుదల కీలక పాత్ర పోషించింది. మరోవైపు బంగాళాదుంపల ధరలు 12 శాతం, టమాటా ధరలు 28 శాతం మేర తగ్గడంతో వెజ్ థాలీ ధరలు మరింత పెరగకుండా కొంతమేర అదుపులో ఉన్నాయి. ఇక జూలై నెలతో పోలిస్తే, శ్రావణ మాసం కారణంగా చికెన్ వినియోగం తగ్గి బ్రాయిలర్ ధరలు 4 శాతం మేర క్షీణించాయి. దీంతో నాన్-వెజ్ థాలీ ధరలో స్వల్ప తగ్గుదల కనిపించింది. అయితే, రబీ పంట సరఫరా తగ్గడం, ఖరీఫ్ పంట రాక ఆలస్యం కావడం వల్ల రాబోయే రెండు మూడు నెలల పాటు ఉల్లి ధరలు అధికంగానే ఉండే అవకాశం ఉందని క్రిసిల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పుషన్ శర్మ అంచనా వేశారు.

'లింఫాటిక్ వాకింగ్'.. ఏంటీ వైరల్ వెల్‌నెస్ ట్రెండ్? ఎలాంటి ప్రయోజనాలుంటాయి?

ఇది సాధారణ నడకకు కొన్ని మార్పులు జోడించే విధానం

నిటారుగా ఉండి చురుగ్గా నడవాలని నిపుణుల సూచన

చేతుల సహజ కదలికలు, లోతైన శ్వాసకు ప్రాధాన్యం

ఎక్కువసేపు కూర్చునేవారికి క్రమం తప్పని నడక ఉపయోగకరం

లింఫాటిక్ వాకింగ్ ప్రత్యేక 'డిటాక్స్' చికిత్స కాదన్న నిపుణులు

వెల్‌నెస్ ట్రెండ్స్ రోజుకో కొత్త రూపం దాలుస్తున్నాయి. జిమ్‌కు వెళ్లాలి.. గంటల తరబడి వర్కౌట్స్ చేయాలి.. హెచ్‌ఐఐటీ, బర్పీస్ అంటూ చెమటలు పట్టించుకోవాలి అనుకునే వారికి ఇప్పుడు ఓ సింపుల్ ట్రెండ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదే 'లింఫాటిక్ వాకింగ్'. ఇందులో ప్రత్యేకమైన పరికరాలు అవసరం లేదు. తెల్లవారుజామునే లేచి నడవాల్సిన పనీ లేదు. సాధారణంగా నడుస్తూనే కొన్ని చిన్న మార్పులు చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఇంతకీ లింఫాటిక్ వాకింగ్ అంటే ఏంటి? నిజంగానే ఇది శరీరంలోని 'టాక్సిన్స్'ను బయటకు పంపిస్తుందా? పొట్ట ఉబ్బరం, శరీరంలో నీరు నిలవడం తగ్గుతుందా? సోషల్ మీడియాలో కనిపిస్తున్న ఈ ట్రెండ్ వెనుక నిజమెంత? తెలుసుకుందాం.

లింఫాటిక్ సిస్టమ్ అంటే ఏంటి?

మన శరీరంలో అదనంగా చేరిన ద్రవాన్ని తిరిగి రక్తప్రసరణలోకి పంపడంలో లింఫాటిక్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. రోగనిరోధక వ్యవస్థలోనూ ఇది ముఖ్యమైన భాగం. దీనికి గుండెలా ఒక ప్రత్యేకమైన కేంద్ర పంపు ఉండదు. కండరాల కదలికలు, శ్వాసతో ఏర్పడే ఒత్తిడి మార్పులు లింఫ్ ద్రవం కదలడానికి సహాయపడతాయి. అందుకే నడకలో కాళ్ల కండరాలు పనిచేయడం లింఫ్ ద్రవం కదలికకు సహాయపడొచ్చని నిపుణులు చెబుతున్నారు. లింఫాటిక్ వాకింగ్ పేరుతో కొత్త వ్యాయామం వచ్చినట్లు కనిపించినా.. వాస్తవానికి ఇది సాధారణ నడకకు కొన్ని చిన్న మార్పులు జోడించిన విధానమే.

ఎలా నడవాలి?

నడిచేటప్పుడు శరీరాన్ని నిటారుగా ఉంచాలి. వేగం మరీ ఎక్కువగా కాకుండా.. సౌకర్యంగా, కాస్త చురుగ్గా నడవాలి. చేతులను సహజంగా ఊపుతూ నడవాలి. ఫోన్ చూస్తూ తల వంచి, భుజాలు ముందుకు వంచుకుని నడవడం కాకుండా శరీర కదలికలపై దృష్టి పెట్టాలి. దీనికి లోతైన, డయాఫ్రాగ్మాటిక్ శ్వాసను జోడించవచ్చు. డయాఫ్రాగ్మాటిక్ బ్రీతింగ్ శ్వాసను మరింత సమర్థంగా తీసుకోవడంలో సహాయపడుతుంది.

ప్రయోజనాలు నిజమేనా?

నడక వల్ల కండరాలు పనిచేస్తాయి. ఎక్కువసేపు కూర్చునే జీవనశైలికి ఇది మంచి ప్రత్యామ్నాయం. కాళ్ల కండరాల కదలిక రక్తప్రసరణకు సహాయపడుతుంది. లింఫాటిక్ వ్యవస్థలో ద్రవం కదలికకూ శారీరక కదలిక ఉపయోగపడుతుంది. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే వారు క్రమం తప్పకుండా నడవడం ప్రయోజనకరమే. లింఫెడీమా వంటి సమస్యల్లోనూ వ్యాయామం చికిత్సలో భాగంగా ఉపయోగపడుతుంది. అయితే సోషల్ మీడియాలో చెప్పినట్లుగా లింఫాటిక్ వాకింగ్ ఏదో ప్రత్యేకమైన 'డిటాక్స్ ట్రీట్‌మెంట్' అని భావించాల్సిన అవసరం లేదు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ లింఫ్ డ్రైనేజ్ కోసం ప్రత్యేకంగా ఈ విధానాన్ని పాటించాల్సిన అవసరం లేదని నిపుణుల అభిప్రాయం. అలాగే బరువు తగ్గడానికి ఇది ఏదైనా రహస్య మార్గం కాదు.

మరి ఎవరికి ఉపయోగం?

ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసేవారు, ఎక్కువసేపు ప్రయాణించే వారు, తీవ్రమైన వ్యాయామాలు చేయలేని వారు క్రమం తప్పకుండా నడవడంపై దృష్టి పెట్టవచ్చు. అయితే లింఫెడీమా, లింఫ్ నోడ్స్ తొలగింపు లేదా దెబ్బతినడం, లింఫాటిక్ డ్రైనేజ్‌లో సమస్యలు ఉన్నవారు మాత్రం వైద్యుల సూచనతో వ్యాయామం చేయడం మంచిది. అన్నింటికంటే ముఖ్యంగా.. లింఫాటిక్ వాకింగ్ పేరుతో ప్రత్యేకంగా ఏదో చేయాల్సిన అవసరం లేదు. కదలకుండా కూర్చోవడం కంటే క్రమం తప్పకుండా నడవడమే అసలు విషయం. ఒక్కసారిగా అతిగా నడవడం లేదా శరీర సామర్థ్యానికి మించి వ్యాయామం చేయడం వల్ల అలసట, కండరాల నొప్పులు, తల తిరగడం వంటి సమస్యలు రావచ్చు. కాబట్టి నెమ్మదిగా మొదలుపెట్టి క్రమంగా పెంచడం మంచిది.

ప్రధాని మోదీ పర్యటనకు ముందు కలకలం

ముంబై: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముంబై పర్యటన సందర్భంగా తీవ్ర కలకలం చెలరేగింది. ప్రధాని పాల్గొనాల్సిన కార్యక్రమంలో ఇద్దరు అగంతకులు చొరబడ్డారు. పీఎంవో అధికారులమంటూ అనుమానాస్పదంగా వ్యవహరించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి తుపాకితో పాటు ఫేక్ ఐడీ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్ వేదికగా 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026' సదస్సు జరగాల్సి ఉంది. ఈ సదస్సును ప్రారంభించేందుకు ప్రధాని మోదీ రావాల్సి ఉంది. అంతకంటే ముందే రోహన్ పరేఖ్ తాను ప్రధాన మంత్రి కార్యాలయ అధికారినంటూ ఆ ఈవెంట్‌కు వచ్చారు. తనిఖీల్లో భాగంగా అతని వద్ద నకిలీ పీఎంవో ఐడీ కార్డుతో పాటు తుపాకీ లభించడంతో భద్రతా బలగాలు ఒక్కసారిగా అప్రమత్తమయ్యాయి. అతనితో పాటు ఉన్న సెక్యూరిటీ గార్డును కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన తీవ్రత దృష్ట్యా ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితుల మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలను పరిశీలిస్తున్నారు.తుపాకులతో, నకిలీ ఐడీలతో నేరుగా ప్రధాని మోదీ హాజరు కావాల్సిన కార్యక్రమానికి ఎందుకు వచ్చారనే అంశంపై లోతుగా విచారణ జరుపుతున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన వార్షిక ఫిన్‌టెక్ సదస్సులలో ఒకటైన 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'ను ముంబైలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ప్రధాని పర్యటన వేళ జరిగిన ఈ భద్రతా లోపం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.

'టెట్' లేకుండా టీచర్లను నియమించొద్దు: సుప్రీంకోర్టు

ఢిల్లీ: అర్హత లేని టీచర్లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, 'టెట్' లాంటి నిర్దేశిత అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమించొద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం పేర్కొంది. అర్హత లేని టీచర్ల నియామకంపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అస్సాం టీచర్ రిక్రూట్మెంట్ కేసులో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీచర్ల రిక్రూట్మెంట్‌పై సమీక్ష చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సరైనటువంటి విద్యార్హతలు లేకుండా టీచర్ల నియామకం చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది.

అర్హత లేని టీచర్ల నియామకంపై సుప్రీంకోర్టు స్టే

విద్యాహక్కు చట్టం, ఎన్‌సీటీఈ, యూజీసీ చట్టం కింద నిర్దేశించిన అర్హతలు లేని వారిని పాఠశాలు, కళాశాలల్లో బోధకులుగా నియమించవద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అర్హత లేని టీచర్లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, టెట్ లాంటి నిర్దేశిత అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమించొద్దని సూచించింది. పోటీతో కూడిన నియామక ప్రక్రియ లేకుండా ఉపాధ్యాయ నియామకాలు జరగకూడదని వ్యాఖ్యానించింది. టీచర్ల ఎంపికలో న్యాయమైన, పారదర్శక విధానాలు పాటించాలని ఆదేశించింది. అస్సాం విద్యా చట్టంలోని ప్రావిన్షియేషన్ ప్రైవేటు పాఠశాలలను ప్రభుత్వ పాఠశాలలుగా మార్చడం.. రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సంస్థల్లోకి అర్హత లేని టీచర్లను అనుమతించొద్దని కోరుతూ పిటిషనర్లు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.ు

'టెట్ లేకుండా ఉద్యోగాలు ఎలా ఇస్తారు?'

తాడేపల్లి: డీఎస్సీలో జరిగిన అక్రమాలు, అవినీతిపై 3.30 లక్షల మంది నిరుద్యోగుల తరపున జూన్ నెల నుంచే వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేసిన మోసాలు బయటపడటంతో సమాధానం చెప్పలేక ఇద్దరు ఐఏఎస్ అధికారులను ముందుకు నెట్టి అబద్ధాలు చెప్పిస్తున్నారని ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. స్పోర్ట్స్ కోటా అక్రమాలలో శాప్ పాత్ర ఉందని, అధికారుల ప్రెస్‌మీట్‌లో మీడియాను బెదిరించినట్లు ఉందన్నారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన చంద్రశేఖర్ రెడ్డి. విద్యాశాఖ మంత్రి, ముఖ్యమంత్రి, డీఎస్సీ కన్వీనర్, శాప్ ఛైర్మన్ చేసిన తప్పులను అధికారులు కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ అక్రమాలన్నింటిపై విచారణ జరిపి తప్పులను తేల్చాల్సిన రోజు అధికారులకు వస్తుంది. స్పోర్ట్స్ డీఎస్సీ, మెగా డీఎస్సీల్లో టెట్ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, విద్యా హక్కు చట్టాన్ని పూర్తిగా తుంగలో తొక్కారు. ఈడిగ ప్రభాకర్‌కు టెట్ అర్హత లేదని స్వయంగా అతనే ఒప్పుకున్నా, 2018లో 77 మార్కులు వచ్చాయని పీపీటీ ద్వారా అబద్ధపు ప్రచారం చేశారు. ఎస్జీటీ పోస్టుకు పేపర్ వన్-ఏ అవసరమైతే, స్పెషల్ స్కూల్స్‌కు వర్తించే పేపర్ టు-బి మార్కులను చూపించి కమిషనర్ ప్రజలను తప్పుదారి పట్టించారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ పరిశీలిస్తే ఎక్కడా ప్రభాకర్‌కు పేపర్ టు-బి రాసిన దాఖలాలు లేవు. డీఎస్సీ ప్రక్రియ ముగిసిన తర్వాత 2025లో జరిగిన టెట్ పరీక్షను ప్రభాకర్ ఎందుకు రాయాల్సి వచ్చిందో అధికారులు సమాధానం చెప్పాలి. జే ఉషా స్కూల్ అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకుంటే, ఆమెకు ఏకంగా స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టు కేటాయించారు. 2017 తర్వాత లాంగ్వేజ్‌లకు ప్రత్యేకంగా టెట్ పాస్ కావాలన్న నోటిఫికేషన్ నిబంధనలను ఉల్లంఘించి ఉషాకు పోస్టు ఇచ్చారు. రాజ్ కుమార్ అనే వ్యక్తికి అర్హత లేకపోయినా, డీఎస్సీ రాయకపోయినా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ ఉద్యోగం కట్టబెట్టారు. తప్పులను ప్రశ్నిస్తున్న మీడియాకు, అభ్యర్థులకు వార్నింగులు ఇస్తూ అక్రమ కేసులు పెడతామని శాప్ ఎండీ బెదిరిస్తున్నారు. జూడో క్రీడలో జరిగిన ఘోరమైన అవకతవకలను రెండు అసోసియేషన్ల మధ్య గొడవగా చిత్రీకరించి తప్పించుకోవాలని చూస్తున్నారు. 2025 సెప్టెంబర్‌లోనే రిక్రూట్‌మెంట్ ముగిస్తే, 2026 జూన్‌లో వెబ్‌సైట్ ద్వారా సర్టిఫికెట్లను అక్రమంగా మార్చేశారు. పెద్దాడ అప్పలరాజుకు తన తమ్ముడి సర్టిఫికెట్‌తో ఉద్యోగం ఇచ్చిన విషయం అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బట్టబయలైంది. ఆర్చరీ, కబడ్డీ అభ్యర్థుల సర్టిఫికెట్లు, విజయాల వివరాలను కూడా అధికారులు నిస్సిగ్గుగా ట్యాంపరింగ్ చేశారు. ఎమ్మెల్యే పూనా రవికుమార్ సంతకాలతో ఇచ్చిన సర్టిఫికెట్లను చెల్లుబాటు చేయడానికి నకిలీ ఆథరైజేషన్ లెటర్లను సృష్టిస్తున్నారు. జీవో నెంబర్ 4, 47 ప్రకారం సెక్రటరీ లేదా జనరల్ సెక్రటరీ మాత్రమే సంతకం చేయాలన్న రూల్ ఉంటే గౌరవ అధ్యక్షుడి సంతకాలను ఎలా ఆమోదిస్తారు. 2018 నోటిఫికేషన్ ప్రకారం స్పోర్ట్స్ పర్సన్లకు గ్రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు 20 శాతం వెయిటేజీ మార్కులు ఇచ్చే నిబంధనను ఎందుకు రద్దు చేశారు. జిల్లా స్థాయిలో డీఎస్‌డీవోల ద్వారా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసే పద్ధతిని పూర్తిగా తొలగించి శాప్‌లో కూర్చుని అక్రమాలకు పాల్పడ్డారు. కలెక్టర్లు, డీఈవోల ఆధ్వర్యంలో జరగాల్సిన 1:1 సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తిగా ఎత్తేసి నియామక పత్రాలు ఇచ్చారు. అభ్యర్థులు పెట్టుకున్న గ్రీవెన్స్‌లను కనీసం పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కోర్టు ఆదేశాలు ఇచ్చినా, శాప్ లేఖలు రాసినా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అర్హులకు న్యాయం చేయకుండా తొక్కిపెట్టింది. కోర్టు ఆదేశాలు ఉన్న 100 జెన్యూన్ కేసులను స్వయంగా తీసుకొస్తాం, గ్రీవెన్స్ ద్వారా బాధితులకు న్యాయం చేసే దమ్ము ప్రభుత్వానికి ఉందా?' ప్రశ్నించారు.

క్విక్ కామర్స్‌లో సొంత బ్రాండ్ల జోరు

సేల్స్‌లో ప్రైవేట్ లేబుల్స్ వాటా రెట్టింపు

కస్టమర్‌ను నిలబెట్టుకునేందుకు కంపెనీల వ్యూహం

స్టేపుల్స్ నుంచి ప్రీమియం ఫుడ్స్, ఫ్రెష్ ప్రొడక్ట్స్ వరకు విస్తరణ

16 శాతానికి పెరిగిన ప్రైవేట్ లేబుల్స్ వాటా

35 నుంచి 45 శాతం వరకు మార్జిన్లు

థర్డ్ పార్టీ బ్రాండ్లతో పోలిస్తే దాదాపు రెట్టింపు

క్విక్ కామర్స్‌లో పోటీ ఇప్పుడు వేగంగా డెలివరీ చేయడానికే పరిమితం కావడం లేదు. ఎక్కువ మార్జిన్లు, ధరలపై నియంత్రణ, సరుకుల లభ్యత, కస్టమర్‌ను తమ ప్లాట్‌ఫామ్‌లోనే కొనసాగించడం కోసం సంస్థలు సొంత బ్రాండ్లపై దృష్టి పెడుతున్నాయి. దీంతో క్విక్ కామర్స్ విక్రయాల్లో ప్రైవేటు లేబుల్స్ వాటా గణనీయంగా పెరుగుతోంది. 2025లో ప్రారంభంలో 6 శాతం ఉన్న వాటా ప్రస్తుతం 16 శాతానికి చేరినట్లు పరిశ్రమ వర్గాల అంచనా.

స్టేపుల్స్ నుంచే శ్రీకారం

సొంత బ్రాండ్ల విస్తరణకు ముందుగా పప్పులు, బియ్యం, పిండి, నూనెలు వంటి రోజువారీ నిత్యావసరాలనే (స్టేపుల్ ఫుడ్)క్విక్ కామర్స్ కంపెనీలు ఎంచుకుంటున్నాయి. తర్వాత ప్రీమియం స్నాక్స్, కూల్‌డ్రింక్స్, డ్రైఫ్రూట్స్, వెజిటబుల్స్ విభాగాల్లోకి అడుగుపెడుతున్నాయి. టాటా గ్రూప్‌నకు చెందిన బిగ్ బాస్కెట్ ఈవిషయంలో పోటీ కంపెనీలకన్నా ముందుంది. ప్రైవేట్‌లేబుల్స్ మొత్తం ఆదాయంలో దాదాపు 35 శాతం వాటాను బిగ్‌బాస్కెట్ కలిగి ఉంది. బీబీ పాపులర్, బీబీ రాయల్, బీబీ హోమ్, ఫ్రెషో వంటి బ్రాండ్లు విభిన్న విభాగాల్లో దూసుకుపోతున్నాయి.

ఇన్‌స్టామార్ట్ జోరు

క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో స్విగ్గీకి చెందిన ఇన్‌స్టామార్ట్ సొంత బ్రాండ్ల విషయంలో చాలా దూకుడుగా వ్యవహరిస్తోంది. సుప్రీమ్ హార్వెస్ట్ బ్రాండ్‌ను 2022లో ప్రారంభించింది. ప్రస్తుతం ఇన్‌స్టామార్ట్‌లో విక్రయించే స్టేపుల్స్‌లో దీని వాటా 25 శాతం. ఏడాది క్రితం ఇది 18 శాతమే. ఉరద్ దాల్ (మినపప్పు) అమ్మకాల్లో సుప్రీమ్ హార్వెస్ట్ వాటా 28 శాతం పైగానే. మైదాలో 51 శాతం, రైస్‌ఫ్లోర్‌లో 58 శాతం వాటా ఉంది. జెప్టోకు చెందిన డైలీ గుడ్ కూడా స్టేపుల్స్‌లో 14 శాతం వాటా సాధించింది. ఉరద్ దాల్, పల్లీలు, కిస్మిస్ విక్రయాలు ఈ బ్రాండ్ నుంచే వస్తున్నాయి. సోయాబీన్ నూనెల్లో 16 శాతం, సన్‌ఫ్లవర్ ఆయిల్ అమ్మకాల్లో డైలీ గుడ్ 5 శాతం వాటా సాధించింది.

ఆచితూచి వ్యవహరిస్తున్న బ్లింకిట్

ఎటర్నల్ (జొమాటో)కు చెందిన బ్లింకిట్ ప్రైవేట్ లేబుల్ 'హోల్ ఫార్మ్' మాత్రం కొంత నియంత్రిత విధానాన్ని అనుసరిస్తోంది. వినియోగదారులు బ్రాండ్ గురించి పెద్దగా పట్టించుకోని మిల్లెట్స్, ప్రత్యేక స్టేపుల్స్ వంటి విభాగాలపై మాత్రమే దృష్టి పెట్టింది. బార్లీ, వైట్ మటర్ అమ్మకాల్లో హోల్‌ఫార్మ్ 62 శాతం వాటా సాధించింది. అయితే పప్పులు, డ్రైఫ్రూట్స్ విభాగాల్లో దీని ఉనికి పరిమితంగానే ఉంది. కస్టమర్లకు ఎక్కువ రకాల ఉత్పత్తులను యాప్ ద్వారా అందుబాటులో ఉంచడానికే బ్లింకిట్ ప్రాధాన్యం ఇస్తోంది.

రెట్టింపు మార్జిన్లే కీలకం

సొంత బ్రాండ్లపై క్విక్ కామర్స్ సంస్థలకు ఎందుకు ఆసక్తి అంటే అధిక లాభాలే..కంపెనీలకు స్టేపుల్స్‌లో ప్రైవేట్ లేబుల్స్ ద్వారా 15 నుంచి 25 శాతం మార్జిన్లు వస్తున్నాయి. థర్డ్ పార్టీ బ్రాండ్లతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. అదే సమయంలో తక్కువ ధరలతో కస్టమర్లను ఆకర్షించి భారీ విక్రయాలు సాధించే వ్యూహాన్ని కూడా ఇవి అనుసరిస్తున్నాయి. సుప్రీమ్ హార్వెస్ట్ చనా దాల్ కేటగిరీ సగటు ధర కంటే దాదాపు 30 శాతం తక్కువగా ఉంటుంది. డైలీగుడ్ మస్టర్డ్ ఆయిల్ థర్డ్ పార్టీ బ్రాండ్ కన్నా 37 శాతం తక్కువ ధరకు, హోల్‌ఫార్మ్ రాగి పిండి 29 శాతం తక్కువ ధరకు కస్టమర్లకు అందుబాటులో ఉన్నాయి.

స్నాక్స్, డ్రింక్స్‌లోనూ ఎంట్రీ

క్విక్ కామర్స్ కంపెనీల సొంత బ్రాండ్ల వ్యూహం అధిక విలువ కలిగిన ప్యాకేజ్డ్ ఫుడ్స్‌కు కూడా చేరింది. ఇన్‌స్టామార్ట్ ప్రీమియం బ్రాండ్ నాయిస్‌కు బెవరేజెస్‌లో 7 శాతం వాటా, స్నాక్స్‌లో 5.5 శాతం వాటా సాధించింది.46కు పైగా కేటగిరీల్లో ఈ బ్రాండ్ విస్తరించింది. ప్రస్తుతం ఇన్‌స్టామార్ట్‌లో వచ్చే ప్రతి 10 కస్టమర్ బాస్కెట్లలో ఒకదానిలో నాయిస్ ఉత్పత్తులు ఉంటున్నాయని స్విగ్గీ తెలిపింది.

ఫ్రెష్ ఫుడ్ మరింత పెద్ద లాభం

ఫ్రెష్ ఫ్రూట్స్, కూరగాయల విభాగం సొంత బ్రాండ్లకు మరింత ఆకర్షణీయంగా మారుతోంది. ఈ విభాగంలో ప్రైవేట్ లేబుల్స్ ద్వారా 45 శాతం వరకు లాభాలు వచ్చే అవకాశం ఉంది. థర్డ్ పార్టీ విక్రేతలతో పోలిస్తే ఇది నాలుగు రెట్లు అధికం. ఇన్‌స్టామార్ట్ బెంగళూరులోని ఐదు డార్క్ స్టోర్లలో నెక్టార్ ఫ్రూట్స్, వెజిటబుల్ బ్రాండ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఈ పైలట్ ప్రాజెక్ట్‌తో కస్టమర్ల ఖర్చు 10 శాతం పెరిగింది. రీపర్చేజ్ రేటు 12 పాయింట్లు, ప్లాట్‌ఫామ్ రిటెన్షన్ 7 శాతం పాయింట్లు మెరుగయ్యాయి.జెప్టో కూడా ముంబై, బెంగళూరులోని ప్రీమియం ప్రాంతాల్లో హార్వెస్ట్ స్టోర్‌ను కస్టమర్లకు ఓపెన్ చేసింది.

స్టాక్ ఉంటేనే కస్టమర్ ఉంటాడు

ప్రైవేట్ లేబుల్స్ వల్ల అధిక లాభాలే కాదు. ఇన్వెంటరీ, ధర, సరుకుల లభ్యత, ప్లాట్‌ఫామ్‌లకు నియంత్రణ లభిస్తుంది. క్విక్ కామర్స్‌లో ఒక ఉత్పత్తి అందుబాటులో లేకపోతే కస్టమర్ వెంటనే మరో యాప్ కు మారిపోయే అవకాశం ఉంటుంది. అందుకే డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి సొంత బ్రాండ్ల ద్వారా సరుకులను తగినంతగా అందుబాటులో ఉంచడం సంస్థలకు కీలకంగా మారుతోంది.

నీతులు చెప్పే చైనాకు.. బాన్కియావో ఘోరకలి గుర్తుందా?

హిమాలయ ప్రాంతంలో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టిస్తున్న వేళ.. చైనా తీరు వివాదాస్పదంగా మారింది. ఫ్లాష్‌ఫ్లడ్స్ గురించి సమాచారం ఉన్నప్పటికీ చైనా తమను హెచ్చరించలేదని నేపాల్ ఆరోపించింది. అయితే చైనా మాత్రం ఆ ఆరోపల్ని ఖండించింది. ఇలాంటి సమయంలో ఆరోపణలు కాదని.. ఇరు దేశాలు పరస్పర సహకారంతో పనిచేయాలని.. ప్రజల ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా ఉండాలని సూచించింది. దీంతో చైనా చెబుతున్న సహకార నీతుల నేపథ్యంలో గతంలో అదే గడ్డపై జరిగిన అతిపెద్ద డ్యామ్ విపత్తు మరోసారి చర్చకు వచ్చింది. బుధవారం నేపాల్‌లోని పలు జిల్లాలను ఆకస్మిక వరద ముంచెత్తింది. ఇళ్లు, దుకాణాలు, రహదారులు, వంతెనలు.. ఊర్లకు ఊళ్లే వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. టిబెట్ సరిహద్దులోని చైనా రీజియన్‌లో మంచు ఫలకాలు కూలిపోవడం వల్ల భారీగా నీరు ఒక్కసారిగా దిగువకు వచ్చిందని ఓ అంచనాకు వచ్చారు. అదే సమయంలో సరిహద్దు ప్రాంతాల్లో చైనా చేపడుతున్న మౌలిక వసతుల నిర్మాణాలపై కూడా నేపాల్‌లోని కొందరు నిపుణులు, జర్నలిస్టులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి హిమాలయ ప్రాంతంలో హిమానీనదాలు, హిమ సరస్సులు, కొండచరియలు, భారీ వర్షాలు, నదీ ప్రవాహాలపై ఎప్పటికప్పుడు సమాచారం ఉండటం దిగువ దేశాలకు అత్యంత కీలకం. టిబెట్‌లో చోటుచేసుకునే ప్రకృతి పరిణామాలు నేపాల్‌లోని నదులపై తక్కువ సమయంలోనే ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే ప్రమాదకర పరిస్థితి ఏర్పడిన వెంటనే దిగువ ప్రాంతాలకు హెచ్చరికలు పంపాల్సిన అవసరం ఉంది. ఇదే విషయంలో నేపాల్ ప్రధానంగా ప్రశ్నలు లేవనెత్తుతోంది.

చైనా చరిత్రలో మాయని మచ్చ

నేపాల్ ఆరోపణల నేపథ్యంలో.. 1975లో చైనాలో జరిగిన బాన్కియావో డ్యామ్(ధీుఅనఖుశీ ఎతీఖుర్రవఎఎ) విపత్తు మళ్లీ గుర్తుకొస్తోంది. హెనాన్ ప్రావిన్స్‌లోని రు నదిపై నిర్మించిన బాన్కియావో డ్యామ్‌ను వరద నియంత్రణ, సాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కోసం నిర్మించారు. నిర్మాణం పూర్తయిన కొద్దికాలానికే డ్యామ్, గేట్లలో పగుళ్లు కనిపించడంతో సోవియట్ ఇంజినీర్ల సాయంతో మరమ్మతులు చేపట్టారు. అయితే ఆ తర్వాత అది 'ఐరన్ డ్యామ్'గా పేరుపొందింది. కానీ 1975 ఆగస్టులో టైఫూన్ నినా కారణంగా హెనాన్‌లో ఊహించని స్థాయిలో వర్షపాతం నమోదైంది. కేవలం మూడే రోజుల్లో.. ఏడాది మొత్తంలో కురిసే వర్షపాతం రికార్డైంది.



దీంతో బాన్కియావో రిజర్వాయర్‌లోకి తీవ్ర ఉధృతిలో నీరు వచ్చి చేరింది. అయితే అప్పటికే పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది.

ఒక రాత్రిలో 62 డ్యామ్‌లు!

1975 ఆగస్టు 8 అర్ధరాత్రి దాటిన కొద్దిసేపటికే బాన్కియావో డ్యామ్ తెగిపోయింది. భారీగా నీరు దిగువ ప్రాంతాలపైకి దూసుకొచ్చింది. బాన్కియావోకు సుమారు 32 కిలోమీటర్ల దూరంలో ఉన్న షిమాంటన్ డ్యామ్ కూడా దెబ్బతింది. అనంతరం వరుసగా అనేక చిన్న రిజర్వాయర్లు, డ్యామ్‌లు నాశనం అవుతూ వచ్చాయి. వాటిలో కొన్నింటిని వరద నీటి మళ్లింపు కోసం కావాలనే ధ్వంసం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. అలా మొత్తం 62 దాకా డ్యామ్‌లు నాశనం అయినట్లు తర్వాత వివిధ నివేదికలతో వెలుగులోకి వచ్చింది.

2 లక్షల మందికిపైనే..

ఈ విపత్తులో మృతుల సంఖ్యపై ఇప్పటికీ ఓ స్పష్టత లేదు. ఆ టైంలో చైనా మీడియా తీవ్రమైన గోప్యత ప్రదర్శించింది. అయితే వరదల కారణంగా 26 వేల మంది మరణించినట్లు 2017లో ప్రిన్స్‌టన్, సింఘువా విశ్వవిద్యాలయ పరిశోధకుల అధ్యయనం పేర్కొంది. కరువు, ఆకలి, అంటువ్యాధుల కారణంగా మరో లక్ష మందికి పైగా మరణించి ఉండొచ్చని ఆ అధ్యయనం అంచనా వేసింది. అయితే మరికొన్ని అంచనాలు మాత్రం ఆ మరణాల సంఖ్య 2.3 లక్షల వరకు ఉండొచ్చని పేర్కొన్నాయి. ఈ సంఖ్యను కొందరు చైనా నిపుణులు అంచనా వేసినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదికలు ప్రస్తావించాయి. మరణాల సంఖ్యను పక్కన పెడితే.. దాదాపు కోటి మంది ఈ విపత్తు ప్రభావానికి గురైనట్లు అంచనాలు ఉన్నాయి.

సమాచారం ఇవ్వక.. విషాదాన్ని దాచి!

బాన్కియావో విషాదంలో చైనాపై మరో తీవ్రమైన ఆరోపణ ఉంది. హెచ్చరికలు సరిగా చేరకపోవడం, అధికారుల నిర్ణయాల్లో జాప్యం, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినడం కూడా విపత్తు తీవ్రతను పెంచినట్లు తరువాతి అధ్యయనాలు వెల్లడించాయి. అటుపై ఈ విపత్తు పూర్తి స్థాయిని ప్రపంచానికి వెల్లడించలేదని పలు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో డ్యామ్‌ల వైఫల్యం, ప్రాణనష్టం, సహాయక చర్యల దుస్థితి వంటి అంశాలు విస్తృతంగా బయటకు రావడానికి చాలా సంవత్సరాలే పట్టింది. ప్రస్తుతం నేపాల్--టిబెట్ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలు ఈ పాత ఘటనతో ఈ పాతగాయం మళ్లీ తెరపైకి వచ్చింది. అయితే నైతిక పాఠాలు చెప్పే చైనా.. తన పౌరుల భద్రతతో పాటు పొరుగు దేశాల ప్రజల ప్రాణాల విషయంలోనూ అదే పారదర్శకత, బాధ్యతను ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. ప్రకృతి విపత్తులు సరిహద్దులు చూడవు.. అలాంటి సమయంలో సమాచారం దాచడం కంటే, ముందస్తు హెచ్చరికలు ఇవ్వడం, సహకారంతో వ్యవహరించడమే నిజమైన మానవత్వం. గత విషాదాల నుంచి పాఠాలు నేర్చుకుని.. భవిష్యత్తు ప్రమాదాలను తగ్గించడమే ప్రతి దేశం ముందున్న అసలైన బాధ్యత.

వాతావరణ మార్పుల ప్రభావమే!

నేపాల్ మెరుపు వరదలపై నిపుణుల అంచనా

కరుగుతున్న హిమనీ నదాలు

వర్ష, హిమపాతాల్లో మార్పులు

పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

అన్నీ కలిపి తరచూ ప్రకృతి విపత్తులు

జూన్, 2013... కేదార్‌నాథ్ క్లౌడ్‌బరస్ట్. ఆరువేల మంది మృతి

ఫిబ్రవరి 2021... రిషిగంగ నందాదేవీ వద్ద మంచు అవపాతం... 200 మంది మరణం. రెండు హైడ్రో పవర్ ప్రాజెక్టులు ధ్వంసం.

ఆగస్టు 2025... ఉత్తరకాశీలోని ధరాలి వద్ద ఖీర్ గంగాపై క్లౌడ్‌బరస్ట్... మెరుపు వరదలతో నలుగురి మరణం. యాభైమంది గల్లంతు.

తాజాగా... నేపాల్‌లో హిమనదం కుప్పకూలి మెరుపు వరదలు..

వందలాది మంది మృతి.. ఆస్తినష్టం!

హిమాలయ పర్వత ప్రాంతంలో సంభవించిన పై నాలుగు భారీ ప్రకృతి విపత్తులకు కారణం ఏమిటి? వాతావరణ మార్పులే అంటున్నారు హిమనీనదాల నిపుణుడైన మనీశ్ మెహతా. కేదార్‌నాథ్, రిషిగంగ, ధరాలి ప్రమాదాలపై దీర్ఘకాలం అధ్యయనం చేసిన ఈయన హిమాలయ పర్వత ప్రాంతాల్లో జరుగుతున్న మార్పులను, ప్రమాద ఘటనలను వేర్వేరుగా చూడలేమని స్పష్టం చేస్తున్నారు. భూతాపోన్నతి ఫలితంగా ఈ ప్రాంతంలోని చాలా హిమనీనదాల కుంచించుకుపోతున్నాయి అన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే దీనివల్ల ఒక ప్రమాదముంది. మంచు, నీటితో కూడిన ప్రాంతం తగ్గిపోవడం వల్ల అడుగున వదులుగా ఉండే మట్టి, రాళ్లు, శిథిలాలు అలాగే ఉండిపోతున్నాయి. ఇంకోలా చెప్పాలంటే ఈ ప్రాంతాల్లో నేల స్థిరంగా ఉండదు. ఎప్పుడైనా ఆకస్మాత్తుగా భారీ వర్షాలు పడినా, పెద్ద మొత్తంలో మంచు కరిగినా ఈ మట్టి, రాళ్లు చాలా సులువుగా వాలు ఉన్నవైపు వెళ్లిపోతాయి. అతితక్కువ కాలంలో ఎక్కువ వర్షం కురిస్తే వదులుగా ఉన్న మట్టి, రాతిప్రాంతం త్వరగా నీటితో నిండిపోయి అకస్మాత్తుగా కిందివైపుకు కదులుతాయని, ఇది కాస్తా కొండచెరియలు విరిగిపడేందుకు లేదా రాతి శిథిలాలు దొర్లేందుకు కారణమవుతాయని ఆయన వివరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఎత్తైన పర్వతప్రాంతాల్లో గడ్డకట్టిన మంచు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ ఉంటాయని, దీనివల్ల అక్కడ తాత్కాలికంగా ఒక డ్యామ్ లాంటి నిర్మాణం ఏర్పడుతుందని చెప్పారు. ఈ తాత్కాలిక అడ్డుగోడ పగిలిపోతే అప్పటివరకూ అక్కడకు చేరిన నీరు, మంచు ఒక్కసారిగా చాలా వేగంగా దిగువ ప్రాంతాలవైపు ప్రయాణిస్తాయని తెలిపారు. కేదార్‌నాథ్‌సహా మిగిలిన చోట్ల వచ్చిన విపత్తుల్లోనూ నీటితోపాటు భారీ బండరాళ్లు కూడా దొర్లుకుంటూ వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నీరు మాత్రమే ప్రవహిస్తే పుట్టే శక్తికంటే ఇలా రాళ్లతో కూడిన ప్రవాహపు శక్తి చాలా ఎక్కువని... మార్గమధ్యంలో ఉండే రహదారులు, వంతెనలు, భవనాలు ఏవీ తట్టుకోలేవని తెలిపారు. వాస్తవానికి హిమాలయ పర్వత ప్రాంతంలో కొండచెరియలు విరిగి పడటం కొత్తేమీ కాదని, కానీ వాతావరణ మార్పుల పుణ్యమా అని ఇప్పుడు ఇలాంటి ఘటనలతో రాగల ప్రమాదాల గురించి పునరాలోచన చేయాల్సి ఉందని ఆయన హెచ్చరించారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలతోపాటు రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా ఎక్కువ కావడం గమనించదగ్గ మార్పని మెహతా చెబుతున్నారు. గతంలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో తేడా ఎక్కువగా ఉండేదని, ఫలితంగా రాత్రిపూట మంచు కరిగే వేగం తగ్గేదని ఆయన వివరించారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతూండటంతో హిమనీనదాలు పగలు, రాత్రి కరుగుతున్నాయని వివరించారు. భూతాపోన్నతితోపాటు హిమనీ నదాలు కుంచించుకుపోవడం, వర్ష, హిమపాతాల్లో వచ్చిన తేడాలు, ఆకస్మిక భారీ వర్షాలు, రాత్రిపూట ఉష్ణోగ్రతల్లో పెరుగుదల, వదులు మట్టితో కూడిన హిమనీ నదీ గర్భాలు, లోతైన పర్వత సానువులు వంటిని అన్నీ హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు పెరిగేందుకు కారణమవుతున్నాయని మనీశ్ మెహతా చెబుతున్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు.

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ మచిలీపట్నం పరాసుపేటలో వేంచేసి ఉన్న శ్రీసువర్చలా సమేత ఆంజనేయ స్వామి దేవాలయంలో ఈరోజు రెండవ మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక

అభిషేకాలు పూజలు అలంకరణలు నిర్వహించారు. ఆలయ భక్తబృదం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం పఠించారు. అనంతరం మధ్యాహ్నం వందలాదిమంది భక్తులకు అన్న సమాధాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్య నిర్వహణ అధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహన్రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమానికి వందలాదిమంది భక్తులు పాల్గొని స్వామి దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

మచిలీపట్నం సాహితీ మణిహారం డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి.!

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సాహితీ మిత్రుల అభినందన.!

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందుకున్న పురిటిగడ్డ జిల్లా పరిషత్ ప్లస్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, సాహితీవేత్త డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి మచిలీపట్నం సాహితీ మిత్రుల సంస్థ సభ్యురాలిగా ఉండటం నగరానికే గర్వకారణమని సంస్థ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ అన్నారు. మంగళవారం నగరంలో డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతిని సాహితీ మిత్రుల సంస్థ తరపున బాలాజీ, కార్యదర్శి మేడిశెట్టి యోగేశ్వరరావు తదితరులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో పాటు సాహిత్య రంగంలోనూ డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి విశేష సేవలు అందిస్తున్నారని కొనియాడారు. సాహితీ మిత్రుల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రావి రంగారావు మార్గదర్శకత్వంలో 'పద్య కవితలు -- ఒక పరిశీలన' అనే అంశంపై ఎం.ఫిల్ పూర్తి చేసిన ఆమె, 'రావూరి భరద్వాజ -- పాకుడు రాళ్లు ఒక పరిశీలన' అనే అంశంపై పీహెచ్‌డీ పొందారని తెలిపారు. ఇప్పటికే నాలుగు పుస్తకాలను రచించి సాహితీ రంగానికి తనదైన ముద్రను వేసుకున్నారని అన్నారు. సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలోని 'కృష్ణా తరంగాలు' పిల్లల మాసపత్రిక సంపాదక వర్గంలో పనిచేసిన డాక్టర్ ఓలేటి, మచిలీపట్నం సాహితీ మిత్రుల సంస్థ ఆధ్వర్యంలో 'కొత్త పూలు' కవితా సంకలనం, 'పద్య పుష్పకం' పద్య కవితా సంకలనం, 'తేనె చినుకులు' బడి పిల్లల కవితా సంకలనాలకు సంపాదకత్వం వహించారని బాలాజీ తెలిపారు. సాహిత్యాన్ని విద్యార్థులకు చేరువ చేయడంలో ఆమె చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి 2019, 2022 సంవత్సరాల్లో కృష్ణాజిల్లా విద్యాశాఖ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయి పద్య, కవితా పోటీల్లో అనేక బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందారని పేర్కొన్నారు. 'కవన కిరణాలు' సాహిత్య సంస్థ ద్వారా 'కవిరత్న', 'వాగ్దేవి కళాపీఠం' ద్వారా 'కవికోకిల' బిరుదులను అందుకున్నారని తెలిపారు. 2023లో 'మహిళా రత్న', 2024లో 'గిడుగు పురస్కారం', గుంటూరు సాహితీ మిత్రుల సంస్థ ద్వారా 'జీవన సాఫల్య పురస్కారం' అందుకున్నారని పేర్కొన్నారు. తాజాగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికై మచిలీపట్నం సాహితీ మిత్రుల సంస్థకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడం సంతోషంగా ఉందని బాలాజీ, యోగేశ్వరరావు అన్నారు. భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ మరిన్ని పురస్కారాలు అందుకుని సాహితీ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉమా సరస్వతి మాట్లాడుతూ సాహిత్య రంగంలో తనను ప్రోత్సహించి, ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు సహకరించిన మచిలీపట్నం సాహితీ మిత్రుల సంస్థ సభ్యుల సహకారం, ప్రోత్సాహం ఎన్నటికీ మరువలేనిదని అన్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు సాహిత్య సేవను కొనసాగిస్తూ సమాజానికి, భావితరాలకు తన వంతు సేవ అందిస్తానని తెలిపారు.రి

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమం గురించి వివరించిన, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ.

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు బందరు మండలంలోని కొత్తపూడి, పొట్లపాలెం, పోతేపల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 17, 18, 27వ బూత్‌ల పరిధిలో జరిగిన ఈ ప్రచారంలో కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వల్ల ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమం, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

రానున్న రోజుల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి తలారి సోమశేఖర్, కాటం మధు, కాగిత సుబ్రహ్మణ్యం, కాగిత శేష శివాజీ, కమ్మిల మధు, పామర్తి చిన్ని, కాగిత శ్రీరామ్, శేఖర్, కొక్కు అంజనేయులు, పామర్తి వీరబాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి.

రీ-సర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం......రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు మరియు ల్యాండు రికార్డ్ల డైరెక్టరు రోణకికి కుర్మనాథ్

కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్ భూముల్లో నిర్వహిస్తున్న రీసర్వేల్లో రైతులను భాగస్వాములను చేసేలా ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని, ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చెయ్యాలని రాష్ట్ర సర్వే, సెటిల్మెంటు అండ్ లాండు రికార్డ్స్ డైరెక్టరు రోణంకి కూర్మనాథ్ అన్నారు. మంగళవారం గన్నవరం మండలం కేసారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీ-సర్వే కార్యక్రమాన్ని ఆయన జిల్లా రెవిన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు సమక్షంలో సర్వే జరగడంతో అయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుర్మనాథ్ మాట్లాడుతూ, రీసర్వేలో తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకత ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే మొదలు పెట్టేరోజున తప్పనిసరిగా సంబంధిత రైతులు లేదా కుటుంబ సభ్యులు క్షేత్ర స్థాయిలో తప్పక ఉండాలని ఉండాలని, సర్వే పూర్తయిన తరువాత డాక్యుమెంటు వెరిఫికేషన్ ద్వారా సరిహద్దులు నిర్ణయం రైతు సమక్షంలోనే నిర్వహించాలన్నారు. రైతులు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందజేసే వరకూ సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని జిల్లా సర్వే సహాయ సంచాలకులను పూజారి లక్ష్మణరావును ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వేలో తప్పులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రైతులు సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా రీసర్వే 2.0 నిర్వహిస్తున్నామని అన్నారు. రీసర్వే నిర్వహించిన తరువాత నోటీసు రూపంలో రైతులకు చూపించిన భూహద్దులు ప్రకారం భూవివరాలను తెలియజేయడం, డాక్యుమెంట్లతో సరిపోల్చుకుని నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కేవైసీ చేయించడం ద్వారా రైతులు సమక్షంలో సర్వే నిర్వహించడంతో పాటు రైతులకు అన్ని విధాలా సమాచారం అందిస్తూ ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రీసర్వేల్లో ఫేజ్-1లో 628,

ఫేజ్-2 లో 748, ఫేజ్-3 లో 729, ఫేజ్-4 లో 1645 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2,800 బృందాలతో అత్యాధునిక రోవర్స్ తో సర్వే నిర్వహించడం జరుగుతున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో భూవివరాలు, డాక్యుమెంటు పరంగా గల వివరాలను రైతులు సమక్షంలోనే సరిపోల్చుతూ ఇకముందు ఎటువంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులు సంతృప్తి చెందే విధంగా రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఫేజ్-5 లో రాష్ట్ర వ్యాప్తంగా 1,343 గ్రామాలలో రైతులతో కలిసిమెలిసి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నామన్నామని, రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలెదురైతే తక్షణ పరిష్కారం చేసే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ విధానాలు పరంగా 2027 మార్చి నాటికి భూవివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దేందుకు తమ అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే సహాయ సంచాలకులు పూజారి లక్ష్మణరావు, తహశీల్దార్ కె.శివయ్య,గుడివాడ డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహశీల్దారు , మండల సర్వేయరు మాధవరావు, రెవెన్యూ, సర్వే సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఒకే రోజు 100 బీజేపీ జెండా స్తూపాల ఆవిష్కరణ.

రికార్డ్ సృష్టించిన బీజేపీ

రాజమహేంద్రవరం,శ్రీ వార్త న్యూస్ మన ఊరు - మన జెండా కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరంలో ఒకే రోజు 100 బీజేపీ జెండా స్తూపాలను ఉదయం 9 నుండి 10 గంటల మధ్య ఒకే సమయంలో ఆవిష్కరించి బీజేపీ శ్రేణులు రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాజమండ్రి 13, 14వ డివిజన్లలో జరిగిన జెండా స్తూపం ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ లో బీజేపీ జెండా ఎగరాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భిణీలకు హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలు తప్పనిసరి

ట్రిపుల్ ఎలిమినేషన్ పై మచిలీపట్నంలో విస్తృత అవగాహన

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్గర్భిణీ స్త్రీకి హెచ్ఐవి, సిఫిలిస్ లేదా హెపటైటిస్-బి ఉన్నప్పుడు సరైన సమయంలో గుర్తించకపోతే ఆ వ్యాధులు బిడ్డకు సంక్రమించే ప్రమాదం ఉందని, సమయానికి పరీక్షలు, చికిత్స తీసుకోవడం ద్వారా బిడ్డకు సంక్రమణను నివారించవచ్చని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఎలిమినేషన్ కార్యక్రమంపై ఫీల్డ్ లెవెల్ లో గైడ్ లైన్స్ ప్రకారం మచిలీపట్నం పీయూ సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. హాస్పిటల్ స్థాయిలో మరియు ఫీల్డ్ లెవెల్ లో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా గర్భిణీలకు అవగాహన కల్పిస్తున్నారు. గర్భం దాల్చిన వెంటనే ప్రతి ఒక్కరూ హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్-బి పరీక్షలు చేయించుకోవాలని, తద్వారా తల్లి నుండి బిడ్డకు వ్యాధి సంక్రమణను పూర్తిగా అరికట్టవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ముందస్తు గుర్తింపు, సరైన చికిత్సతో ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు

బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలి.

సున్నిత ప్రాంతాల్లో కాన్ఫిడెన్స్ బిల్డింగ్ చర్యలు చేపట్టాలి...జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు చట్టప్రకారం అందాల్సిన పరిహారాన్ని సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. కేసుల పరిష్కారంలో కేవలం ప్రక్రియాపరమైన అంశాల కారణంగా జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, డీఆర్వో కే. శ్రీధర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు షేక్ షాహిద్ బాబు, కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, దర్యాప్తు, చార్జిషీట్ల దాఖలు, పరిహారం చెల్లింపులు, పెండింగ్ కేసులు, బాధితుల సమస్యలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. 79 మంది బాధితులకు రూ. 1.30 కోట్ల పరిహారం మంజూరు2025 జనవరి 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ (పీ.ఓ.ఏ.) చట్టం కింద 79 మంది బాధితులకు సంబంధించిన కేసులు నమోదైనట్లు అధికారులు వివరించారు. బాధితులకు పరిహారం కింద మొత్తం రూ. 1,30,33,750 మంజూరైనట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు రూ. 86.28 లక్షల బడ్జెట్ విడుదల కాగా,

అందులో 44 మంది బాధితులకు రూ. 86,10,482 పరిహారం చెల్లించినట్లు అధికారులు వివరించారు. ఇంకా 35 మంది బాధితులకు రూ. 44,23,268 పరిహారం చెల్లించాల్సి ఉందని తెలిపారు. పెండింగ్ పరిహారం చెల్లింపుల కోసం అదనపు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు. 2025 జనవరి 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకు మండలాల వారీగా నమోదైన కేసుల వివరాలను కూడా సమావేశంలో పరిశీలించారు. బందరు డివిజన్ పరిధిలో 30 కేసులు, 36 మంది బాధితులు, గుడివాడ డివిజన్ పరిధిలో 19 కేసులు, 22 మంది బాధితులు, అదేవిధంగా ఉయ్యూరు డివిజన్ పరిధిలో 17 కేసులు, 21 మంది బాధితులు ఉన్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 35 మంది బాధితులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్‌లో పరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా అవసరమైన నిధుల కోసం ముందస్తు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎఫ్ఎస్ఎల్ నివేదికలు, అవసరమైన ధ్రువపత్రాలు, క్యాస్ట్ సర్టిఫికెట్లు తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. కేసుల నమోదుకు, దర్యాప్తుకు, చార్జిషీట్ల దాఖలుకు సంబంధించి నిర్దేశిత గడువులను అధికారులు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కుటుంబాలు భయాందోళనలకు గురికాకుండా పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం (కాన్ఫిడెన్స్ బిల్డింగ్) చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలను డీఎస్పీ, ఆర్డీఓ, తహసీల్దార్, ఎస్‌హెచ్ఓలు కలిసి సందర్శించి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని, బాధితుల భద్రతకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సున్నిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు చర్యలు చేపడతామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వచ్చే ఫిర్యాదులపై అధికారులు అత్యంత సున్నితంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ప్రాథమిక వాస్తవాలను పరిశీలించి, సంఘటన జరిగిన సమయం, సంబంధిత వ్యక్తుల ఉనికి, అందుబాటులో ఉన్న ఆధారాలు, తటస్థ సాక్షుల వివరాలను పరిశీలించాలని ఎస్పీ సూచించారు. నిజమైన కేసుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో సాధారణ స్థానిక వివాదాలను అనవసరంగా పెద్ద సమస్యలుగా మార్చకుండా అధికారులు వివేకంతో వ్యవహరించాలని తెలిపారు. చట్టాన్ని సమర్థంగా అమలు చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో సామాజిక సామరస్యాన్ని కాపాడటం కూడా ముఖ్యమన్నారు..సంచార జీవన విధానం కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ సేవలు అందాలి.సంచార జీవన విధానం కారణంగా ఎస్టీ వర్గాలకు చెందిన యానాది కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. వారు ఒక ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకునేలా సంఘ నాయకులు అవసరమైన సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన కుటుంబాలకు గృహ వసతి, ఆధార్, రేషన్ కార్డు, పెన్షన్, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆధార్ కార్డులు లేని లేదా కోల్పోయిన వారికి ప్రత్యేక చర్యల ద్వారా ఆధార్ సేవలు అందించేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో మచిలీపట్నం గుడివాడ ఉయ్యూరు ఆర్డీఓలు కే సాంబశివరావు, జి బాలసుబ్రమణ్యం, ఎస్ కరుణ కుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, డీఎస్పీలు ఏ శ్రీనివాసరావు, కే ధర్మేంద్ర, పాల శ్రీనివాస్, ఎస్బీ సీఐ సత్య కిషోర్, కమిటీ సభ్యులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001